మహిళల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం

-రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు

7



వీసీలో మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేశ్‌రెడ్డి, కలెక్టర్

ధర్మాస్పత్రిలో.. కాసుల వేట

కుటుంబ నియంత్రణ ఆపరేషన్ కోసం రూ.6 వేలు వసూలు



జనరల్ ఆస్పత్రిలోని పీపీ యూనిట్‌లో కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించుకున్న మహిళలు

కుటుంబ నియంత్రణ ఆపరేషన్ల కోసం ఆ ఆస్పత్రిలో డబ్బులు వసూలు చేస్తున్నారు. విభాగానికి సంబంధం లేని వారు రోగులను తీసుకొచ్చి, అడ్మిట్ చేయడమే కాకుండా ఆపరేషన్లు కూడా చేయిస్తున్నారు. అందుకుగాను ఒక్కొక్కరి వద్ద రూ.3,000 నుంచి రూ.6,000 వరకు వసూలు చేస్తున్నారు. ఇదంతా ఎక్కడో మారుమూల ఆస్పత్రిలో అనుకుంటే పొరపాటే. సాక్షాత్తూ జిల్లా కేంద్రం నడిబొడ్డున ఉన్న జనరల్ ఆస్పత్రిలో జరుగుతున్న బాగోతం. 'ఆంధ్రజ్యోతి' జరిపిన పరిశీలనలో ఈ అక్రమాలు వెలుగు చూశాయి.

– మహబూబ్‌నగర్ (వైద్యవిభాగం), ఆంధ్రజ్యోతి

ఆంధ్రజ్యోతి నిఘా

- ఆపరేషన్ కోసం రూ.3,000.. ధ్రువపత్రాలు, ఇతర వాటి పేర మరో రూ.3,000
- విభాగంతో సంబంధం లేని వ్యక్తులు వసూలు
- జనరల్ ఆసుపత్రిలోని పీపీ యూనిట్‌లో బాగోతం
- 'ఆంధ్రజ్యోతి' పరిశీలనలో వెలుగులోకి

మహబూబ్‌నగర్‌లోని జనరల్ ఆస్పత్రిలో కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేసేందుకు డబ్బులు వసూలు చేస్తున్నారు. జనరల్ ఆస్పత్రిలోని పీపీ యూనిట్ విభాగంలో మొత్తం 16 పడకలు ఉన్నాయి. రోజూ 16 మందికి కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేస్తారు. ఈ ఆపరేషన్లు కేవలం సాధారణ కాన్పు అయిన వారికి మాత్రమే చేస్తారు. ఒక రోజు ఆపరేషన్, మరుసటి రోజు పరిశీలనలో ఉంచుకొని మూడో రోజు డిశ్చార్జి చేస్తారు.

రూ.6 వేల వరకు వసూలు

కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయడానికి రూ.3,000 నుంచి రూ.6,000 వరకు వసూలు చేస్తున్నారు. ఆపరేషన్ చేయడానికి ముందు రూ.3,000, ఆపరేషన్ చేయించుకున్న తర్వాత రెండు రోజుల్లో మరో రూ. 3,000 ఇవ్వాలి. ఇందులో రూ.3,000 ఒకరికి, మరో రూ.3,000లలో రూ.1,000 ధ్రువీకరణ పత్రానికి, రూ.1,000 నర్సింగ్ సిబ్బందికి, మరో రూ.1,000

(మిగతా 6లో..)



మహబూబ్‌నగర్‌లోని జనరల్ ఆస్పత్రి

కోట్లు ఖర్చు పెట్టినా సక్రమంగా అందని వైద్యం

- ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రాణాలు పోయాయి
- కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి

కల్వకుర్తి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : 'కోట్ల రూపాయలు ఖర్చు పెట్టినా పేదలకు సరైన వైద్యం అందడం లేదు. కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రిలో సౌకర్యాలు లేక పోవడంతో ఓ వ్యక్తి ప్రాణాలు కోల్పోయాడు..' అని నాగర్‌కర్నూల్ జిల్లా, కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తప్పుగా భావించినా, వైద్యులు బాధపడినా.. ఇది వాస్తవమని ఆయన విమర్శించారు. కల్వకుర్తి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కల్వకుర్తి ప్రాంతంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారన్నారు. వారిలో ఒకరి కాలుకు తీవ్ర గాయమై రక్తస్రావం జరిగిందన్నారు. కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రిలో సౌకర్యాలు లేకపోవడంతో అతడిని హైదరాబాద్‌కు తీసుకెళ్లేందుకు గంటన్నర సమయం పట్టిందన్నారు. దీంతో అతడు ప్రాణాలు కోల్పోయారన్నారు. రెండు రోజుల క్రితం పెద్దాపూర్ సమీపంలో మరో ప్రమాదం జరిగిందని, ఒక బాలిక అక్కడికక్కడే మృతి చెందగా, మరో ఇద్దరు గాయపడ్డారని పేర్కొన్నారు. ఇక్కడ గతంలోనే వంద పడకల ఆసుపత్రిని ఏర్పాటు చేసి ఉంటే ఈ పరిస్థితి ఉండేది కాదని అభిప్రాయపడ్డారు.

25 నుంచి మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలు

- మత్స్య కార్మిక సంఘం జిల్లా కన్వీనర్ పెబ్బేటి శంకర్

6



గట్టు పీఏసీఎస్ వద్ద ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో రైతుల నుంచి కర్ణాటక వ్యాపారి కొనుగోలు చేసిన ధాన్యాన్ని లారీలో లోడ్ చేస్తున్న హమాలీలు

కర్ణాటకకు.. తెలంగాణ ధాన్యం

- హమాలీ, తాలు, తరుగు అడగకపోవడం..
- అధిక ధర చెల్లించడమే ప్రధాన కారణం
- కొనుగోలు కేంద్రాల వైపు కన్నెత్తి చూడని రైతులు
- సరిహద్దు చెక్‌పోస్టులు ఎత్తేయడంతో దర్జాగా ధాన్యం తరలింపు

గట్టు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : జోగులాంబ గద్వాల జిల్లాలోని గట్టు, కేటీదొడ్డి మండలాల రైతులు వానాకాలంలో పడించిన ధాన్యాన్ని కర్ణాటక వ్యాపారులకు విక్రయిస్తున్నారు. మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినప్పటికీ రైతులు అటువైపు చూడటం లేదు. నిత్యం కర్ణాటక వ్యాపారులు ఇక్కడే తిష్ఠ వేసి రైతుల కల్లాల వద్దకు వెళ్లి ధాన్యాన్ని తూకం వేసుకుని లారీలలో తరలిస్తున్నారు. సరిహద్దు చెకపోస్టులు ఎత్తి వేయడంతో వ్యాపారులు దర్జాగా ధాన్యాన్ని తరలిస్తున్నారు.

వెంటనే నగదు చెల్లింపులు..

కర్ణాకకు చెందిన వ్యాపారులు జోగులాంబ గద్వాల జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు జోరుగా నడుపుతున్నారు. గట్టు, కేటీదొడ్డి మండలాల్లోని రైతుల కల్లాల వద్దకు వచ్చి తాలు, తరుగు, ఏవీ చూడకుండా నేరుగా కాంటా చేసి తీసుకెళ్తున్నారు. అంతే కాకుండా హమాలీ, రవాణా చార్జి కూడా వ్యాపారులే భరించడం.. ధర కూడా అధికంగా చెల్లించడంతో పాటు వెంటనే చెల్లిస్తున్నారు. దీంతో తెలంగాణ రైతులు కర్ణాటక వ్యాపారులకే విక్రయించేందుకు మొగ్గు చూపుతున్నారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం ధాన్యానికి మద్దతు ధర రూ.2,389 ప్రకటించింది. కానీ కర్ణాటక వ్యాపారులు క్వింటాలుకు ధర రూ.2,500 లకు పైగా చెల్లిస్తున్నారు. డబ్బులు కూడా జీరో కమీషన్‌తో వెంటనే చెల్లిస్తుండటంతో రైతులు తెలంగాణలోని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావడం లేదని తెలుస్తోంది. అంతే కాకుండా రాష్ట్ర ప్రభుత్వం యాసంగి సీజన్‌లో విక్రయించిన ధాన్యానికి బోనస్ కూడా చెల్లించకపోవడంతో రైతులు పక్క రాష్ట్రానికి విక్రయించేందుకు మొగ్గు చూపుతున్నారు.

ఒక్క క్వింటాలు కూడా కొనుగోలు చేయలే

వానాకాలం సీజన్‌కు సంబంధించి ఇప్పటివరకు ఆలూరు కొనుగోలు కేంద్రం వద్ద ఒక్క క్వింటాలు ధాన్యం కూడా కొనుగోలు చేయలేదంటే కర్ణాటక వ్యాపారుల ఎఫెక్ట్ ఎంతలా ఉందో అర్థం చేసుకోవచ్చు. పెంచికలపాడు కొనుగోలు కేంద్రం దగ్గర 780 క్వింటాళ్లు, గట్టు కేంద్రం దగ్గర 608 క్వింటాళ్లు, మాచర్ల దగ్గర 316 క్వింటాళ్ల ధాన్యం మాత్రమే కొనుగోలు చేసినట్లు పీఏసీఎస్ ఇన్‌చార్జి సెక్రటరీ వెంకటేష్ వివరించారు.

పట్టణ అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ అవసరం



మాట్లాడుతున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): వనపర్తి పట్టణాన్ని పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా తీర్చిదిద్దడానికి మాస్టర్ ప్లాన్ అవసరమని, దాని రూపకల్పన కోసం సంబంధిత శాఖల అధికారులు, స్టేట్ హోల్డర్లు అవసరమైన వివరాలు ఇవ్వాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో డీటీసీపీ అదనపు సంచాలకులు, అమృత్ 2.0 నోడల్ అధికారి అశ్విని, కలెక్టర్‌తో కలిసి సంబంధిత శాఖల అధికారులకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ... అమృత్ 2.0పథకం కింద వనపర్తి మునిసిపాలిటీలో జీఐఎస్ ఆధారిత మాస్టర్ ప్లాన్ రూపకల్పన సమర్థవంతంగా చేపట్టాలన్నారు. మాస్టర్ ప్లాన్ రూపకల్పనకు అవసరమైన సమాచారం వివిధ శాఖలు 15 రోజుల్లో అందించాలన్నారు. పట్టణ ప్రస్తుత పరిస్థితులను అర్థం చేసుకుని, రాబోయ 20 ఏళ్ల వరకు భవిష్యత్ అవసరాలు అంచనా వేయడానికి ప్రాదేశిక వివరాలను సేకరించాలని తెలిపారు. డీటీసీపీ అదనపు సంచాలకులు మాట్లాడుతూ.. అమృత్ 2.0పథకం కింద 50 వేల నుంచి 90వేల జనాభా కలిగి ఉన్న వనపర్తికి మాస్టర్ ప్లాన్ కోసం గత ఏడాది నవంబరులో సర్వే చేపట్టామని, తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ యాదయ్య, మునిసిపల్ కమిషనర్, వెంకటేశ్వర్లు, ఇతర అధికారులు, లైసెన్సు టౌన్ ప్లానర్లు పాల్గొన్నారు.

బలవంతపు భూసేకరణ వద్దు

-తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపిన రైతులు



తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న రైతులు

7

మత్స్యకారుల సంక్షేమానికి పెద్దపీట



కేసరి సముద్రంలో చేప పిల్లలను వదులుతున్న ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి

నాగర్‌కర్నూల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : మత్స్యకారుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేశ్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో సామాన్యులకు మేలు చేకూరుతుందని, సంక్షేమ పథకాలను నిరంతరం కొనసాగిస్తామని ఆయన అన్నారు. బుధవారం నాగర్‌కర్నూల్ కేసరి సముద్రంలో చేప పిల్లలను వదిలే కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై చేప పిల్లలను వదిలారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వెనకబడిన వర్గాలు, దళితులు మైనార్టీల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం నిబద్ధతతో కృషి చేస్తోందన్నారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఆర్భాటాల కోసం చేసిన అప్పుల కారణంగా రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దివాలా తీసినప్పటికీ సంక్షేమ పథకాలను మాత్రం కొనసాగిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రమణరావు, మత్స్యశాఖ ఏడీ నరసింహారావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు వంకేశ్వరం నిరంజన్, ఎండీ నిజాం, శ్రీనివాసులు, రాజు, ఇంద్రారెడ్డి, మైనార్టీ నాయకులు ఉన్నారు.

అంగన్‌వాడీ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలి

- అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పార్వతమ్మ

6

దేశ ఆర్థిక పురోభివృద్ధికి ఇందిరా గాంధీ సంస్కరణలే కారణం

- ప్రణాళికా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జిల్లెల చిన్నారెడ్డి

బ్లాక్ లిస్టులోని మిల్లులకు ధాన్యం ఇవ్వం

- 81 మిల్లులకు మాత్రమే అనుమతులు
- ఇప్పటికీ 25,300 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశాం
- అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ



వనపర్తి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : గతంలో సీఎంఆర్‌ను సకాలంలో ఇవ్వని మిల్లులను బ్లాక్ లిస్టులో పెట్టామని, ఆ మిల్లులకు ఈ ఏడాది ధాన్యాన్ని కూడా కేటాయించలేదని అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 187 రైస్ మిల్లులు ఉండగా అందులో రా రైస్ మిల్లులు 173, బాయిల్డ్ మిల్లులు 14 ఉన్నాయని తెలిపారు. ఇందులో సకాలంలో ప్రభుత్వానికి బియ్యం ఇచ్చిన 81 మిల్లులకు ధాన్యం ఇచ్చేందుకు ఈ సారి అనుమతులు ఇచ్చినట్లు ఆయన బుధవారం ఆంధ్రజ్యోతికి ఇచ్చిన ఇంట ర్వ్యూలో తెలిపారు.

ఎన్ని కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు?

జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 299 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాం. వీటి ద్వారా 25,300 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొను గోలు చేశాం. రైతులకు త్వరలోనే డబ్బులు వారి ఖాతాల్లో జమ చేస్తాం.

ధాన్యం ఎంత మేర వస్తుందని భావిస్తున్నారు?

జిల్లా వ్యాప్తంగా ఈ సీజన్‌లో ఒక లక్ష 99 వేల ఎకరాలలో వరి సాగు చేశారు. కొంతమేర ప్రైవేటుకి పోను కొనుగోలు కేంద్రాలలో 3.50లక్షల మెట్రిక్ టన్నులకు ధాన్యం వస్తుందని అంచనా వేశాం. ఈ మొత్తాన్ని కొనుగోలు చేసేందుకు లక్ష్యంగా పెట్టుకున్నాం.

దొడ్డు, సన్న రకాన్ని వేర్వేరుగా కొనుగోలు చేస్తున్నారా?

రాష్ట్ర ప్రభుత్వం గత యాసంగి సీజన్ నుంచి సన్నాలకు బోనస్ ఇస్తామని చెప్పడంతో దొడ్డు, సన్న రకం ధాన్యాన్ని వేర్వేరుగా కొనుగోలు చేస్తున్నాం. గత యాసంగి సీజన్‌కు సంబంధించిన బోనస్ డబ్బుల రిపోర్టు కూడా ప్రభుత్వానికి పంపించాం. ఈ సీజన్‌కు సంబంధించిన ధాన్యం డబ్బులతో పాటు బోనస్ డబ్బులు ఒకేసారి రైతుల ఖాతాలో జమ చేస్తాం.

గన్నీ బ్యాగుల కొరత ఉందనే ఆరోపణ వాస్తవమేనా?

3.50లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఇందుకు మొత్తం ఒక కోటి 50వేల గన్నీ బ్యాగులు అవసరం. ప్రస్తుతానికి 67లక్షలు అందుబాటులో ఉన్నాయి. మిగతావి త్వరలోనే తెప్పిస్తాం. రైతులు ఇబ్బంది పడకుండా అన్ని ఏర్పాట్లు చేస్తాం.

ధాన్యాన్ని మిల్లులకు తరలించేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు..?

కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్ప టికప్పుడు మిల్లులకు తరలిస్తున్నాం. ఈసారి ధాన్యం తరలించే ప్రతీ వాహ నానికి జియో ట్యాగింగ్ ఏర్పాటు చేశాం. దీని వలన ధాన్యం పక్క దారి పట్టకుండా ఉంటుంది.

కొనుగోలు కేంద్రాల్లో పరికరాలు ఉన్నాయా..?

ప్రస్తుతానికి 4,498 టార్పాలిన్లు అందుబాటులో ఉన్నాయి. ప్రతీ సెంటర్‌కు పది చొప్పున ఇవ్వమని ఆదేశాలు జారీ చేశాం. 17ప్యాడీ క్లీనర్లు, రెండు డ్రయ్యర్లు ఉన్నాయి. ధాన్యం తడిసిన రైతులు వీటిని వాడుకోవచ్చు. తేమ శాతం కొలిచే యంత్రాలు 468, ఎలక్ట్రానిక్ కాంటాలు 436 ఉన్నాయి.

బ్యాంక్ గ్యారెంటీ ఇవ్వని మిల్లుల పరిస్థితి ఏంటి?

వర్షాకాలం ధాన్యం కేటాయించేందుకు 81 మిల్లులకు అనుమతిచ్చాం. బ్యాంకు గ్యారెంటీ ఇచ్చిన వారికి మాత్రమే ధాన్యాన్ని కేటాయిస్తాం. ఇప్పటి వరకు 49 మిల్లర్లు బ్యాంకు గ్యారెంటీ ఇచ్చారు. ఇవ్వని వాళ్లకు 2 రోజులు సమయం ఇస్తాం. ఇవ్వని పక్షంలో చర్యలు తీసుకుంటాం.

ముందడుగు

- కొత్తపల్లి-జూరాల బ్రిడ్జి నిర్మాణానికి కార్యరూపం
- రూ.84.26 కోట్లతో టెండర్లు పూర్తి
- జనవరిలో పనులు ప్రారంభమయ్యే అవకాశం
- ఆర్అండ్‌బీ ఆధ్వర్యంలో మట్టి నమూనాల సేకరణ
- బ్రిడ్జి పూర్తయితే గద్వాల ఆత్మకూర్ ప్రాంతాలు మరింత అభివృద్ధి

7

మన సంప్రదాయాలను నేటి తరానికి తెలపాలి

- కలెక్టర్ బీఎం సంతోష్

అలంపూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : అలంపూరు ఆలయాలు మన ప్రాంతంలో ఉండటం గర్వకారణం. అలంపూరు పట్టణంలోని సంగమేశ్వరదేవాలయ ఆవరణలో బుధవారం పురావస్తుశాఖ సర్వే ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రపంచ వారసత్వ వారోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నవంబరు 19నుంచి 25 వరకు జరిగే ఈ వారోత్సవాల ప్రధాన లక్ష్యం సంప్రదాయ, వారసత్వ మూలాలను తెలపడమేనని కలెక్టర్ అన్నారు. మానవ నాగరికతకు మూలాధారమైన ఆధ్యాత్మి కాన్ని ప్రతీ ఒక్కరు పెంపొందించుకోవాలని అన్నారు. ఈ ప్రాంతం నవబ్రహ్మ ఆలయాలు, పాపనాశి ఆలయం, జోగుళాంబ శక్తిపీఠం, సంగమేశ్వర తదితర ఆలయాలను అద్భుత శిల్పకళా నైపుణ్యంతో నిర్మించారని, ఈ చారిత్రక వైభవాన్ని విద్యార్థులకు తెలియజేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఆలయాల పునః నిర్మాణంలో పురావస్తు వారి నిబద్ధత, శాస్త్రీయ దృక్పథం ఎంతో ఉందని అన్నారు. కార్యక్రమంలో పురావస్తుశాఖ సూపరింటెండెంట్ ఎన్. నిహిల్‌దాస్, హృశీచ్‌ఆర్ దేశాయ్, రోహిణి పాండే, కృష్ణ చైతన్య, కిషోర్‌కుమార్, సాయికృష్ణ, తహసీ ల్దారు మంజుల తదితరులు ఉన్నారు.

పంటకు నీరు పెడుతుండగా విద్యుదాఘాతం

- యువ రైతు మృతి



శ్రీకాంత్ (ఫైల్)

కొల్లాపూర్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : పంటకు నీరు పెట్టేందుకు వెళ్లిన ఓ యువ రైతు విద్యుదాఘాతంతో మృతి చెందాడు. నాగర్‌కర్నూల్ జిల్లా, కొల్లాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని చౌటబెట్ల గ్రామానికి చెందిన మండ్ల శ్రీకాంత్ (24) బుధవారం సాయంత్రం తాళ్ల నర్సింగాపురం రహదారిలో ఉన్న తన పొలానికి వెళ్లాడు. అప్పటికే ఎల్‌టీ విద్యుత్ తీగ తెగి నీటి పడిలో ఉంది. పంటకు నీరు పెట్టేందుకు పోతున్న శ్రీకాంత్ గమనించకుండా తీగపై కాలువేయడంతో విద్యుదాఘాతానికి గురై పడిపోయాడు. చుట్టు పక్కల రైతులు గమనించి, తమ్ముడు శివకు సమాచారం ఇవ్వడంతో కుటుంబ సభ్యులు అతడిని కొల్లాపూర్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అప్పటికే అతడు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. తల్లిదండ్రులు గతంలోనే మృతి చెందడంతో నాయనమ్మతో కలిసి ఉంటున్నారు.

రాష్ట్రస్థాయి టెన్నికాయిట్ పోటీలకు విద్యార్థుల ఎంపిక



రాష్ట్రస్థాయి టెన్నికాయిట్ పోటీలకు ఎంపికైన విద్యార్థులు

మక్తల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లా టెన్నికాయిట్ ఆధ్వర్యంలో స్థానిక సత్యసాయి మందిరంలో జిల్లాస్థాయి టెన్నికాయిట్ ఎంపికలు నిర్వహించినట్లు జిల్లా ప్రధాన కార్యదర్శి బి.దీప తెలిపారు. నారాయణపేట జిల్లాలో 120మంది పాల్గొనగా ప్రతిభ కనబర్చిన బాలికలను ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈనెల 20, 21తేదీల్లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు పంపిస్తున్నట్లు తెలిపారు. ఈ పోటీలను టెన్నికాయిట్ ఉపాధ్యక్షుడు బి.గోపాలం ప్రారంభించారు. ఎంపికైన వారిలో సమత, చరిత్ర, అశ్వినీ, ఫైజా, అనూష, వైష్ణవి, మంజుల, మాళవిక, బాలుర విభాగంలో విశాల్, కార్తీక్, హరికృష్ణ, ప్రసాద్, గౌతమ్, గురుచరణ్, కార్తీక్, శ్రీకాంత్, రాంచరణ్, రమేష్ ఉన్నారు. సత్యసాయి సేవాసమితి నిర్వాహకులు భాస్కర్, శుభోదయ రాములు, పీఈటీలు దామోదర్, వెంకటేష్, రాధమ్మలు పాల్గొన్నారు.

నేడు అండర్-19 క్రికెట్ ఉమ్మడి జిల్లా ఎంపికలు

జడ్చర్ల, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఎస్జీఎఫ్ అండర్-19 ఉమ్మడి జిల్లా క్రికెట్ సెలక్షన్స్ ఈ నెల 20న జడ్చర్లలోని మినీస్టేడియంలో నిర్వహించనున్నట్లు బుధవారం ఎస్జీఎఫ్ జిల్లా కార్యదర్శి శారదాబాయి ఓ ప్రకటనలో తెలిపారు. బాల, బాలికల సెలక్షన్స్ నిర్వహిస్తున్నట్లు, క్రీడాకారులు తమ 10వ తరగతి మెమో, బోనఫైడ్, ఆధార్‌కార్డు జిరాక్స్ తీసుకురావాలని సూచించారు. అలాగే ఈ నెల 21న అండర్-17 ఉమ్మడి జిల్లా బాల, బాలికల క్రికెట్ సెలక్షన్స్‌ను జడ్చర్ల మినీ స్టేడియంలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

23న ఉమ్మడి జిల్లా వాలీబాల్ జట్ల ఎంపిక

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): వాలీబాల్ పోటీలకు ఉమ్మడి జిల్లా బాల,బాలికల జట్ల ఎంపికలు ఈ నెల 23న స్టేడియం మైదానంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా వాలీబాల్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు శాంతికుమార్, మహ్మద్‌హనీఫ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజన్నసిరిసిల్లలో ఈ నెల 29 నుంచి డిసెంబరు 2వ తేదీ వరకు నిర్వహించనున్న 8వ రాష్ట్రస్థాయి జూనియర్ వాలీబాల్ టోర్నీలో పాల్గొంటారన్నారు. 23న ఉదయం 8.30 గంటలకు బాలురు కోచ్ పర్వేజ్, బాలికలు ఆర్గనైజింగ్ సెక్రటరీ చెన్న వీరయ్యకు రిపోర్టు చేయాలని కోరారు.

21న ఉమ్మడి జిల్లా సాఫ్ట్‌బాల్ బాల బాలికల జట్లు..

జిల్లా స్కూల్ గేమ్స్ ఫేడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 17న అండర్-17, 19 ఉమ్మడి జిల్లా సాఫ్ట్‌బాల్ బాల,బాలికల జట్ల ఎంపికలను నిర్వహిస్తున్నట్లు ఎస్జీఎఫ్ సెక్రటరీ శారదాబాయి ఒక ప్రకటనలో తెలిపారు. అండర్-17 క్రీడాకారులు స్కూల్ బోనఫైడ్, ఆధార్‌కార్డు జిరాక్స్‌తో, అండర్-19 క్రీడాకారులు పదవ తరగతి మెమో, బోనఫైడ్, ఆధార్‌కార్డుతో ఉదయం 9 గంటలకు స్టేడియం మైదానంలో పీడీలు నాగరాజు, రాఘవేందర్‌కు రిపోర్టు చేయాలని కోరారు.

ఉమ్మడి జిల్లా సాఫ్ట్‌బాల్ పురుషుల జట్లు..

ఆదిలాబాద్‌లో ఈ నెల 28 నుంచి 30వ తేదీ వరకు నిర్వహించనున్న రాష్ట్రస్థాయి సీనియర్స్ పురుషుల సాఫ్ట్‌బాల్ టోర్నీలో పాల్గొనే ఉమ్మడి పురుషుల జట్ల ఎంపికలను ఈ నెల 21న నిర్వహిస్తున్నట్లు జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ప్రతినిధులు రాఘవేందర్, నాగరాజు ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌జూనియర్, జూనియర్ రాష్ట్రస్థాయి టోర్నీలో పాల్గొన్న వారు సీనియర్ టోర్నీలో ఆడటానికి అర్హులని పేర్కొన్నారు. మధ్యాహ్నం 3 గంటలకు సంబంధిత ధ్రువపత్రాలతో స్టేడియం మైదానంలో సాఫ్ట్‌బాల్ కోచ్‌కు రిపోర్టు చేయాలని కోరారు.

అండర్-14 రాష్ట్ర క్రికెట్ పోటీలకు విద్యార్థుల ఎంపిక



అండర్-14 క్రికెట్ పోటీలకు ఎంపికైన విద్యార్థులు

నారాయణపేట న్యూటౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 15న మక్తల్ మినీ స్టేడియంలో జరిగిన జిల్లా అండర్ 14 క్రికెట్ పోటీల్లో జిల్లా కేంద్రానికి చెందిన సాయి హర్షిత్, కార్తీక్‌రాజ్, చరణ్, అతిక్‌లు ఎంపికైనట్లు పీడీ రమణ తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం స్థానిక క్రీడామైదానంలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. క్రీడాకారులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చిన కోచ్ అజయ్‌కుమార్‌ను అభినందిస్తూ, జిల్లా నుంచి అండర్ 14 టీంకు 20 మంది విద్యార్థులు ఎంపికయ్యారన్నారు. ఇందులో పట్టణానికి చెందిన వారే నలుగురు ఉన్నారన్నారు. రాష్ట్ర స్థాయి పోటీలలో కూడా మంచి ప్రతిభ కనబరిచి ఉన్నత స్థాయికి ఎదుగాలని కోరారు.

మాగనూరు విద్యార్థి..



సిద్దార్థ్‌ను సన్మానిస్తున్న డీఈవో, ఎంఈవో

మాగనూరు, నవంబరు 19 (ఆంధ్ర జ్యోతి): స్థానిక జడ్పీ హెచ్ ఎస్‌లో 7వ తరగతి చదువుతున్న సిద్ధార్థ్ రాష్ట్ర స్థాయి అండర్-14 క్రికెట్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం తెలిపారు. వచ్చే నెల భద్రాచలంలో జరిగే ఈ పోటీలలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నుంచి ఈ విద్యార్థి ఎంపికైనట్లు తెలిపారు. విద్యార్థి ఎంపికపట్ల డీఈవో గోవిం దరాజులు, ఎంఈవో మురళీధర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు అభినం దించారు. విద్యార్థికి క్రికెట్ కిట్‌ను అందిస్తానని ఎంఈవో హామీ ఇచ్చారు.

అండర్-15 క్రికెట్ ప్రాబబుల్స్‌కు జిల్లా వాసి ఎంపిక



మాన్వితకు జెర్సీ బహూకరిస్తున్న పీఈటీ రమణ, క్రీడాకారులు

దామరగిద్ద, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట జిల్లా దామరగిద్ద మండలం వత్తుగుండ్ల తండాకు చెందిన మాన్విత అండర్ -15 హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ప్రాబబుల్స్‌కు ఎంపిక అయ్యారు. ఈ సందర్భంగా స్థానిక క్రీడాకారులు ఆమెను, కోచ్ అజయ్‌కుమార్‌ను అభినందించారు. విద్యార్థికి పీఈటీ రమణ జెర్సీని బహూకరించారు.

ధర్మాస్పత్రిలో కాసుల వేట

(5వ పేజీ తరువాయి)

శానిటేషన్ సిబ్బందికి వస్తున్నారు.

విభాగంతో సంబంధం లేని వ్యక్తులు వసూలు

పీపీ యూనిట్‌లో రోగుల నుంచి ఆ విభాగానికి సంబంధం లేని ఇద్దరు వసూలు చేస్తున్నారు. అందులో ఒకరు జనరల్ ఆసుపత్రిలో పని చేసే ప్లంబర్ ముంతాజ్‌ఖాన్ కాగా, మరొకరు జిల్లా కేంద్రంలోని బండ్లగేరిలో పనిచేసే ఆశా కార్యకర్త. కొంతమంది ఆశ కార్యకర్తలు వారు తీసుకొచ్చే అమాయక మహిళలను ఆ ప్లంబర్‌కు పరిచయం చేయిస్తున్నారు. అతని ద్వారా ఆపరేషన్ చేయించి, డబ్బులు కూడా అతనికే ఇప్పిస్తున్నారు. ఇతను చాలా వరకు నగదు రూపంలోనే తీసుకుంటున్నాడు. డబ్బులు వచ్చిన తర్వాత అందరూ పంచుకుంటున్నారు. అదే విధంగా బండ్లగేరిలో పనిచేసే ఓ ఆశా కార్యకర్త వారికి పరిచయం ఉన్న మహిళలను తీసుకొచ్చి అడ్మిట్ చేయిస్తుంది. అన్ని జాగ్రత్తలు చెప్పి, అక్కడే పని చేస్తున్నట్లు నమ్మబలికి ఆ తర్వాత ఆమె అకౌంట్లోకి(ఫోన్ పే, గూగుల్ పే) డబ్బులు వేయించుకుంటోంది.

ఆంధ్రజ్యోతి పరిశీలనలో వెలుగులోకి..

పీపీ యూనిట్‌లో డబ్బులు వసూలు చేస్తున్నారనే సమాచారం తెలియడంతో 'ఆంధ్రజ్యోతి' పరిశీలన చేసింది. తమకు తెలిసిన వ్యక్తిని రంగంలోకి దింపి, ఆ ప్లంబర్‌కు ఫోన్ చేయించి ఆస్పత్రిలోనే కలిసింది. దీంతో అతను ఆపరేషన్‌కు రూ.4 వేలు ఖర్చు అవుతుందని, ముందుగా రూ.1,000 ఇవ్వాలని, ఆపరేషన్ పూర్తయ్యి డిశ్చార్జి అయ్యేరోజు మిగతా రూ.3,000 ఇవ్వాలని చెప్పాడు. మేము ఒక్కరమే కాకుండా లోపల ఉండే సిస్టర్లకు, ఇతర సిబ్బందికి కూడా డబ్బులు ఇవ్వాల్సి ఉంటుందని చెప్పాడు. అదే విధంగా వార్డులో ఆపరేషన్ చేయించుకున్న మహిళలను సంప్రదించగా తమను ఓ సిస్టర్ జాయిన్ చేసిందని, ఆమెకు ఫోన్‌పే ద్వారా డబ్బులు వేశామని చెప్పారు. ఇదే విషయమై సదరు ఆశా కార్యకర్తను ఫోన్‌లో సంప్రదించగా తన 20 ఏళ్ల సర్వీసులో నన్ను ఎవరూ అడగలేదని, మీరెవరకు తనను అడగడానికని చెప్పడం గమనార్హం.



కు.ని శస్త్రచికిత్స ధ్రువపత్రం చూపిస్తున్న అమిస్తాపూర్‌కు చెందిన బాలమణి

ఆ ఇద్దరు పీపీ యూనిట్‌లో పనిచేసే వారు కాదు..

కుటుంబ నియంత్రణ ఆపరేషన్లకు డబ్బులు వసూలు చేస్తున్న వారిలో ఆ ఇద్దరు మా పీపీ యూనిట్‌లో పనిచేసే వారు కాదు. వాళ్లు వసూలు చేసేదానికి, మాకు ఎలాంటి సంబంధం లేదు. మేము గానీ, మా సిబ్బంది గానీ ఎవరితో డబ్బులు తీసుకోవడం లేదు. నంబర్ ప్రకారమే మేము వారిని పిలిపించి ఆపరేషన్ చేస్తున్నాము. బయటి వ్యక్తులకు గానీ, మా సిబ్బందికి గానీ ఆపరేషన్ కోసం డబ్బులు ఇవ్వొద్దు. ఎవరైనా అడిగితే మాకు ఫిర్యాదు చేయండి. ఇకపై అలాంటి వసూళ్లపై నిఘా ఉంచుతాం.

- డాక్టర్ రఫీక్,
పీపీ యూనిట్ మెడికల్ ఆఫీసర్

దేశ ఆర్థిక పురోగభివృద్ధికి ఇందిరాగాంధీ సంస్కరణలే కారణం

- ప్రణాళికా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జిల్లెల చిన్నారెడ్డి



ఇందిరాగాంధీ విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న చిన్నారెడ్డి, కాంగ్రెస్ నాయకులు

వనపర్తి టౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఇందిరా గాంధీ ప్రవేశపెట్టిన సంస్కరణలే నేడు భారతదేశ ఆర్థిక పురోగభివృద్ధికి దోహదం చేస్తున్నాయని ప్రణాళికా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి అన్నారు. దేశ మాజీ ప్రధానమంత్రి ఇందిరాగాంధీ జయంతిని పురస్కరించుకుని బుధవారం కాంగ్రెస్ నాయకులు జిల్లా కేంద్రంలో ఇందిరాగాంధీ విగ్రహానికి ఘనంగా నివాళి అర్పించారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నందిమల్ల యాదయ్య, జిల్లా అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ యాదవ్, ప్రభుత్వ న్యాయవాది కిరణ్‌కుమార్, ఖమ్మర్ మియా, చీర్ల జనార్ధన్, వర్కింగ్ ప్రెసిడెంట్ కదిరె రాములు, అక్తర్, ఎండీ బాబా, సహదేవ్ యాదవ్, అంజిరెడ్డి, కోళ్ల వెంకటేష్, చిట్టెమ్మ, ఇర్షద్, రాంబాబు, పిట్టల శ్రీను, బజార్, గట్టు వినోద్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదల అభ్యున్నతికి పాటు పడ్డారు

దేశంలోని నిరుపేదల అభ్యున్నతికి పాటు పడిన ఉక్కు మహిళ ఇందిరాగాంధీ అని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. జయంతిని పురస్కరించుకుని కాంగ్రెస్ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఆమె విగ్రహానికి పూలమాలలతో ఘనంగా నివాళి అర్పించారు. మార్కెట్ యార్డ్ చైర్మన్ బండారు శ్రీనివాస్‌గౌడ్, ఎస్ఎల్ఎన్ రమేష్, మునిసిపల్ మాజీ చైర్మన్ పుట్టపాకల మహేష్, బ్రహ్మంచారి, మధుసూదన్‌గౌడ్, చీర్ల సత్యంసాగర్, శంకర్‌నాయక్, తిరుపతయ్య, చుక్క రాజు మరియు తదితరులు పాల్గొన్నారు.

21న ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం

- కొల్లాపూర్‌లో బహిరంగ సభ



కొల్లాపూర్‌లో ప్రచార రథాలను జెండా ఊపి ప్రారంభిస్తున్న మత్స్యకార సంఘం సీనియర్ నాయకుడు డాక్టర్ పగిడాల శ్రీనివాసులు

కొల్లాపూర్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ మ్స్యకారుల దినోత్సవాన్ని ఈనెల 21న శుక్రవారం కొల్లాపూర్ పట్టణంలో ఘనంగా నిర్వహించనున్నట్లు ఆ సంఘం సీనియర్ నాయకుడు డాక్టర్ పగిడాల శ్రీనివాసులు తెలిపారు. నియోజకవర్గంలోని తెనుగొల్ల సాంప్రదాయ మత్స్యకారులు అధిక సంఖ్యలో పాల్గొని కొల్లాపూర్ పట్టణ కేంద్రంలో నిర్వహించే మహాసభను విజయవం తం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. బుధవారం కొల్లాపూర్ పట్టణంలోని రాజా ప్యాలెస్ ఆవరణంలో ఆయనతో పాటు, భయ్య వెంకటస్వామి, సింగిల్ విండో చైర్మన్ పెబ్బేటి కృష్ణయ్యతో కలిసి మత్స్యకారులు జెండా ఊపి ప్రచార రథాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ.. ప్రపంచ మత్స్యకారుల దినోత్సవానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర మంత్రులు జూపల్లి కృష్ణారావు, పశు సంవర్ధక శాఖ మత్స్య శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, ఎంపీ ఈటెల రాజేందర్, ముదిరాజ్ సంఘం రాష్ట్ర నాయకుడు నీలం మధు హాజరవుతున్నట్లు తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లా మత్స్యశాఖ అధ్యక్షుడు వాకిటి ఆంజనేయులు, మత్స్యశాఖ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భయ్య వెంకటస్వామి, తెనుగొల్ల రాష్ట్ర నాయకుడు పెబ్బేటి కృష్ణయ్య, మండల అధ్యక్షుడు గడ్డిగోపుల ఎల్లయ్య, సొప్పరి వెంకటస్వామి, గుర్రపు శ్రీనివాసులు, గట్టు ఆంజనేయులు తది తరులు పాల్గొన్నారు.

వరుస సెలవులు.. సమయానికి రారు..

- ఓ ఉపాధ్యాయుడి నిర్లక్ష్యం...
- విద్యకు దూరమవుతున్న గిరిజన బిడ్డలు

ఊర్కొండ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఓ ఉపాధ్యాయుడు విధులకు వరుస సెలవులు పెడుతున్నారు.. వచ్చిన కొద్ది రోజుల్లోనూ సమయానికి రావడం లేదు. దీంతో ఆయన నిర్లక్ష్య ధోరణితో గిరిజన బిడ్డలు విద్యకు దూరమవుతున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా ఊర్కొండ మండలంలోని బాల్యలోక్య తండా ప్రాథమిక పాఠశాలలో ఐదు తరగతులుండగా 17 మంది విద్యార్థులకు ఒకే ఒక ఉపాధ్యాయుడు మనోహర్ కుమార్ విధులు నిర్వహిస్తున్నాడు. అంతకు ముందు ఈ పాఠశాలలో సుమారుగా 35 మంది విద్యార్థులుండగా బదిలీపై మనోహర్‌కుమార్ వచ్చినప్పటి నుంచి వారి సంఖ్య తగ్గిపోయింది. ఆర్థిక పరిస్థితి బాగా ఉన్నవారు వేరే పాఠశాలలకు పంపిస్తుండగా, నిరుపేద విద్యార్థులు ఇక్కడే విద్యను కొనసాగిస్తున్నారు. ఉపాధ్యాయుడు సమయానికి రాకపోవడంతో పాటు వరుసగా సెలవులు తీసుకుంటుండటంతో విద్యాబోధన జరగడంలేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

వరుసగా సెలవుల అనంతరం సోమవారం, మంగళవారం పాఠశాలకు 11 గంటలకు వచ్చి మధ్యాహ్నం 12 గంటలకు వెళ్లిపోయారు. బుధవారం సైతం 10-30 వచ్చి 11-30 వెళ్లి తిరిగి 3-30కి రావడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఉపాధ్యాయుడిని నిలదీశారు.

దీనికి నేను ఇలాగే వస్తాను అంటూ సమాధానం చెప్పడంతో వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అబ్దుల్ రహీం, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు: వరుసగా 25 రోజుల పాటు సెలవులు పెట్టడంతో పాటు అప్పుడప్పుడు సెలవులు పెడుతున్నారు. ఈ మధ్య కాలంలో సమయపాలన పాటించడంలేదని మా దృష్టికి వచ్చింది.

విద్యాబోధన జరుగడం లేదని తెలిసింది. విచారణ జరిపి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి చర్యలు తీసుకుంటాం.

ఉపాధ్యాయుడి సస్పెన్షన్

పెద్దకొత్తపల్లి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఎట్టకేలకు జిల్లా అధికారులు కీచక ఉపాధ్యాయుడిపై చర్య తీసుకున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా విద్యాధికారి రమేష్‌కుమార్ బుధవారం సాయంత్రం సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలం గంట్రావుపల్లిలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇంగ్లీష్ ఉపాధ్యాయుడు పవన్‌జైన్ పాఠశాలలో విద్యార్థినులతో అసభ్యకరంగా ప్రవర్తించాడు. ఈ విషయం విద్యార్థినులు తమ తల్లిదండ్రుల దృష్టికి తీసుకెళ్లడంతో ఆగ్రహానికి గురయ్యారు. వెంటనే పాఠశాల వద్దకు చేరుకున్న పేరెంట్స్ ఉపాధ్యాయుడిని తోటి ఉపాధ్యాయుల సమక్షంలో దేహశుద్ధి చేసిన విషయం పత్రికలు, మీడియాల్లో ప్రసారమయ్యాయి. దీనిపై విచారణ నిమిత్తం పెద్దకొత్తపల్లి ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి గంట్రావుపల్లి పాఠశాలకు వెళ్లి రెండవ రోజు విచారణ చేశారు. ఈ విచారణ నివేదిక ఆధారంగా కీచక ఉపాధ్యాయుడు పవన్‌జైన్‌ను జిల్లా విద్యాధికారి రమేష్‌కుమార్ సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

ఉపాధ్యాయుడిపై కేసు నమోదు

గంట్రావుపల్లి ఉన్నత పాఠశాలలో విద్యార్థినీల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన ఉపాధ్యాయుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వి.నతీష్ తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోక్సో కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ సతీష్ పేర్కొన్నారు.

వ్యక్తి అదృశ్యం



శివకుమార్

అమరచింత, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): వ్యక్తి అదృశ్యమైన సంఘటన వనపర్తి జిల్లా అమరచింత మండల పరిధిలోని నాగల్‌కడు మూర్‌లో బుధవారం చోటు చేసుకుంది. ఎస్ఐ స్వాతి తెలిపిన వివరాల ప్రకారం ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని చిన్నకడుమూరు గ్రామానికి చెందిన శివకుమార్ హైదరాబాద్‌కు వెళ్తానని చెప్పి మంగళవారం ఇంటి నుంచి వెళ్లాడు. వెళ్లిన తరువాత రెండు రోజులు కావస్తున్నా ఫోన్ స్విచ్ ఆఫ్ చేసుకోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. దీంతో శివకుమార్ ఆచూకీ కోసం బంధువులందరిని అడగగా ఎవరికీ శివకుమార్ ఆచూకి తెలవకపోవడంతో బుధవారం రాత్రి తండ్రి ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఇద్దరి మృతిపై కేసు నమోదు

జడ్చర్ల, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం గొల్లపల్లి సమీపంలోని శ్రీసాలాసర్ స్పిన్నింగ్ మిల్లులో మంగళవారం జరిగిన అగ్ని ప్రమాదంలో ఇద్దరు మృతిచెందిన సంఘటనపై బుధవారం కేసు నమోదు చేసినట్లు జడ్చర్ల సీఐ కమలాకర్ తెలిపారు. ఉత్తర ప్రదేశ్ రాష్ట్రం కన్నౌజి జిల్లా గ్రామ్‌గరియ గ్రామానికి చెందిన దేవరాజ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. స్పిన్నింగ్ మిల్లులోని బేల్ ప్రాసెసింగ్ సెక్షన్‌లో మధ్యాహ్నం సమయంలో దేవరాజ్, సుముసేతి, హరీందర్, పపుసేతిలు కలిసి పనిచేస్తున్నారు. మిషన్ వద్ద సడన్ స్పార్క్ వచ్చి ఒక్కసారిగా మంటలు రేగి, కాటన్ బేళ్లు అంటుకున్నాయి. పెద్ద ఎత్తున చెలరేగిన మంటలలో నలుగురు కార్మికులు ఇరుక్కున్నారు. దేవరాజ్, సుముసేతిలు తీవ్రంగా గాయపడి, కాలినగాయాలతో బయటపడ్డారు. హరీందర్(29), పపుసేతి(26) మంటలో కాలిపోయి అక్కడికక్కడే మృతిచెందారు. తీవ్రంగా గాయపడిన దేవరాజ్, సుముసేతిలను చికిత్స కోసం జిల్లా జనరల్ ఆసుపత్రికి, అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని అమీర్‌పేట వెల్‌నెస్‌కు తరలించారు. ఈ సంఘటనపై సమగ్ర విచారణ చేపట్టి, చట్టరీత్యా చర్యలు తీసుకోవాలంటూ దేవరాజ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు సీఐ వివరించారు.

అంగన్‌వాడీ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలి

- అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పార్వతమ్మ



సమావేశంలో మాట్లాడుతున్న అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పార్వతమ్మ

నాగర్‌కర్నూల్ టౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 25, 26 తేదీల్లో ఆదిలాబాద్‌లో జరగనున్న తెలగాణ అంగన్‌వాడీ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పార్వతమ్మ కోరారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో యూనియన్ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్వతమ్మ మాట్లాడుతూ రాష్ట్ర మహాసభలో అంగన్‌వాడీలకు కనీస వేతనం పెంపు, ఉద్యోగ భద్రత, గ్రాటీటీ, పెన్షన్ తదితర సమస్యలపై చర్చించి బవిష్యత్తు కార్యచరణ రూపొందించనున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర మహాసభలకు జిల్లాలోని అంగన్‌వాడీలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని ఆమె కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పొదిల రామయ్య, అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు మాసమ్మ, అలివేల, చిట్టెమ్మ, లక్ష్మీ, కృష్ణవేణి, భాగ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ ఉద్యోగులకు ప్రతిభా పురస్కారాలు అందజేత

కొల్లాపూర్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : గత నెలలో కొల్లాపూర్ ఆర్టీసీ డిపోలో ఆదర్శ ఉద్యోగులుగా ఎంపికైన ఉద్యోగస్తులకు బుధవారం డిపో మేనేజర్ ఉమాశంకర్ ప్రతిభ పురస్కారాలు అందజేశారు. డిపోలో బుధవారం నిర్వహించిన ఆదర్శ ఉద్యోగుల అభినందన సభలో డిపో మేనేజర్ ఉమా శంకర్ ఉద్యోగులను ఉద్దేశించి మాట్లాడారు. పలువురు డ్రైవర్లు, కండక్టర్లు, మెకానికల్ సిబ్బందికి ప్రశంసాపత్రాలు అందజేసి ప్రశంసించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సూపరింటెండెంట్ రత్నమ్మ, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు వెంకటేశ్వర్లు, భాస్కర్, కార్యాలయ సూపరింటెండెంట్ నజీర్, మెకానికల్ సూపర్‌వైజర్ రహీం, ఏడీసీలు వెంకటయ్య, వేణుగోపాల్ పాల్గొన్నారు.

25 నుంచి మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలు

- సంఘం జిల్లా కన్వీనర్ పెబ్బేటి శంకర్



పెద్దకొత్తపల్లిలోని బస్టాండ్ చౌరస్తాలో నాల్గవ మహాసభ వాల్ పోస్టర్లను విడుదల చేస్తున్న నాయకులు

పెద్దకొత్తపల్లి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : కరీంనగర్ పట్టణంలో ఈనెల 25, 26 తేదీల్లో జరగనున్న మత్స్యకార్మిక సంఘం రాష్ట్ర నాల్గవ మహాసభలను జయప్రదం చేయాలని మత్స్యకార్మిక సంఘం జిల్లా కన్వీనర్ పెబ్బేటి శంకర్ కోరారు. బుధవారం పట్టణంలోని అంబేడ్కర్ బస్టాండ్ చౌరస్తాలో రాష్ట్ర మహాసభల వాల్ పోస్టర్లను విడుదల చేశారు. మత్స్యకారులు అధిక సంఖ్యలో పాల్గొని మహాసభలను జయప్రదం చేయాలని ఆయన కోరారు. నాయకులు గడ్డికోపుల ఎల్లయ్య, పెబ్బేటి రాజశేఖర్, బి.వెంకటస్వామి పాల్గొన్నారు.

చౌడేశ్వరి దేవాలయంలో ఉసిరి చెట్టుకు పూజలు



పెంట్లవెల్లి చౌడేశ్వరి ఆలయంలో సత్యనారాయణ వ్రతం చేస్తున్న పూజారి

పెంట్లవెల్లి నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని చౌడేశ్వరి ఆలయంలో కార్తీకమాసం చివరి రోజు సందర్భంగా ఉసిరిచెట్టు కింద సత్యనారాయణస్వామి వ్రతాన్ని వేద పండితులు బాలకృష్ణ నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ నాయకులు శివ, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

రక్త నమూనాలను సేకరించిన వైద్య బృందం



అమరచింతలో రక్తనమూనాలను సేకరిస్తున్న జిల్లా వైద్యబృందం

అమరచింత, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): డెంగ్యూ అనుమానిత కాలనీలో బుధవారం వనపర్తి జిల్లా యాంటీ లార్వా ఆపరేషన్ టీం (ఏఎల్ఓ) పర్యటించి పలువురి రక్తనమోనాలను సేకరించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని 10వ వార్డులో డెంగీ వ్యాపించిందని అనుమానంతో సంబంధిత అనుమానిత ఇంటిని పరిశీలించి వారి రక్తనమూనాలను సేకరించారు. కాలనీలోని చుట్టుపక్కల ఇళ్లను పరిశీలించారు. హెల్త్ సూపర్‌వైజర్ సురేందర్ గౌడ్, డాక్టర్ ఝాన్సీ, జిల్లా ఏఎల్ఓ టీం సభ్యులు గంధం రాజు, సాయన్న, లక్ష్మణ్, లక్ష్మీనరసమ్మ, స్థానిక ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, ల్యాబ్ టెక్నీషియన్లు, మునిసిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

క్రైం కార్నర్

ఎద్దు పొడిచి వ్యక్తి మృతి


బిట్లి సాయన్న (ఫైల్)

మదనాపురం నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఎద్దు పొడవగా వ్యక్తి మృతి చెందిన సంఘటన వనపర్తి జిల్లా మదనాపురం మండలంలో చోటు చేసుకుంది. మండలంలోని నర్సింగాపురం గ్రామానికి చెందిన బిట్లి సాయన్న (58) రోజు మాదిరిగానే బుధవారం తన ఎద్దులను మేపడానికి పొలాల దగ్గరికి వెళ్లాడు. అనుకోకుండా ఎద్దు అతనిని ఎదపై బలంగా పొడిచింది. దీంతో ఆయన అక్కడికక్కడే కింద పడిపోయాడు. ఇది గమనించిన రైతులు వెంటనే అంబులెన్స్‌లో కొత్తకోట ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమంగా ఉండడంతో మహబూబ్‌నగర్‌కు తరలించారు. అప్పటికే చనిపోయినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతునికి భార్యతో పాటు ము గ్గురు కుమారులు ఉన్నారు.

చికిత్స పొందుతూ..

కోడేరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరు మండల పరిధిలోని మాచుపల్లి గ్రామానికి చెందిన బోయపుట్ట కురుమూర్తి (23)చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ జగదీశ్వర్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. మాచుపల్లి గ్రామానికి చెందిన కురుమూర్తి రాజాపూర్ గ్రామానికి వెళ్లి తిరుగు ప్రయాణంలో ఈ నెల 17న రాత్రి సింగయ్య పెల్లి నివాసంలో రైస్ మిల్ దగ్గర కుక్క అడ్డం రాగా తప్పించోయాడు. ప్రమాదవశాత్తు బైక్‌పై నుంచి కింద పడి తలకు బలమైన గాయాలు కావడంతో అతనిని హైదరాబాద్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స చేయించగా విషమించి బుధవారం చనిపోయినట్లు తెలిపారు. మృతుని తండ్రి పుట్టా సాయిలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

ఉరేసుకొని వ్యక్తి బలవన్మరణం


శ్రీను (ఫైల్)

మన్ననూర్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి చెట్టుకు ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం మన్ననూరు గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. గ్రామంలోని ఉమామహేశ్వర గిరిజన తండాకు చెందిన విస్లావత్ శ్రీను(33) అనే వ్యక్తి వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తుంటాడు. మంగళవారం అర్ధరాత్రి ఇంట్లో భార్య నిర్మలతో గొడవ పడి, భార్యతో పాటుగా, కూతురు మీనాక్షిని దాడి చేసి గాయపరిచాడు. గాయాలైన తల్లీ కూతుళ్లను చికిత్స నిమిత్తం మంగళవారం అర్ధరాత్రి అచ్చంపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. భార్య, పిల్లలను దాడి చేసిన తననేమైనా చేస్తారేమోననే ఆందోళనతో అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో తన వ్యవసాయ పొలంలో చెట్టుకు ఉరేసుకున్నాడు. బుధవారం ఉదయం వ్యవసాయ పొలంలో శ్రీను చెట్టుకు ఉరేసుకొని చెట్టుకు వేలాడుతూ విగతజీవిగా కనిపించాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు శ్రీను మృతదేహానికి శవ పంచనామా చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం అమ్రాబాద్ సివిల్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మనోహర్ తెలిపారు.

ఇసుక టిప్పర్ పట్టివేత


పోలీసులు స్వాధీనం చేసుకున్న ఇసుక టిప్పర్

దామరగిద్ద, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఎలాంటి ప్రభుత్వ అనుమతి లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్‌ను బుధవారం దామరగిద్ద పోలీసులు పట్టుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. నారాయణపేట మండలం షేర్నపల్లి గ్రామానికి చెందిన టిప్పర్ డ్రైవర్ అశోక్ దామరగిద్ద మండలం మొగల్‌మడ్క గ్రామానికి అక్రమంగా ఇసుక తరలిస్తుండగా లోకుర్తి గ్రామ శివారులో దామరగిద్ద పోలీసులు పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కి తరలించారు. డ్రైవర్ అశోక్, ఓనర్ ఎం.శివకుమార్ గౌడ్‌పై కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ అరుణ్ తెలిపారు.

చేపల వలకు చిక్కిన భారీ కొండచిలువ


కొండ చిలువ


శ్రీరంగాపూర్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): వనపర్తి జిల్లా శ్రీరంగాపూర్ మండల కేంద్రంలోని రంగసముద్రం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లో బుధవారం మత్స్య కారుల వలకు భారీ కొండ చిలు వ చిక్కుకుంది. మత్స్యకారులు గ్రామ యువకులు సాగర్ స్నేక్స్ సొసైటీకి సమాచారం ఇవ్వగా వారు వచ్చి కొండ చిలువను వ లల నుంచి రక్షించారు. ఈ సం దర్భంగా సాగర్ స్నేక్ సొసైటీ వారు మాట్లాడుతూ రిజర్వాయర్‌లో నిరంతరం నిండుగా నీరు ఉండడం వల్ల ఇలాంటి పెద్ద పాములు చేరుతాయని ప్రజలు అప్రమత్తం ఉండాలని సొసైటీ సభ్యులు శ్రీరంగాపూర్ గ్రామస్థులకు సూచించారు.

విద్యార్థినికి బైకు ఢీకొట్టిన సంఘటనపై కేసు నమోదు

నాగర్‌కర్నూల్ క్రైం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో పాఠశాల విద్యార్థిని హేమలత(7) రోడ్డు దాటుతుండగా మంగళవారం బైకు ఢీకొట్టిన సంఘటనలో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గోవర్ధన్ బుధవారం తెలిపారు. మంగళవారం పాఠశాలకు వచ్చిన తాడూరు మండలం చెర్లతిర్మలాపురం గ్రామానికి చెందిన హేమలత జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాల ముగిసిన తర్వాత ఇంటికి వెళ్తున్న క్రమంలో రోడ్డు దాటుతుండగా బైకు ఢీ కొట్టింది. ఈ సంఘటనలో స్థానికులు విద్యార్థినిని చికిత్స నిమిత్తం జిల్లా ఆసుపత్రికి తరలించారు.

వైద్యులు పరీక్షించి తలకు తీవ్ర గాయాలు కావడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై విద్యార్థిని తాత తిరుపతయ్యగౌడ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గోవర్ధన్ తెలిపారు.

తప్పిపోయిన బాలిక అప్పగింత



బాలికను పోలీసుల సమక్షంలో తల్లికి అప్పగిస్తున్న దృశ్యం

నర్వ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లా నర్వ నుంచి పాతర్చేడ్ గ్రామానికి వెళ్లే రహదారిలో పెట్రోల్ బంక్ దగ్గర ఓ బాలిక ఏడుస్తూ ఉండడం చూసిన బంక్ సిబ్బంది పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు బాలికను స్టేషన్‌కు తరలించి రెండు గంటల్లో వివరాలను తెలుసుకుని తల్లిదండ్రులకు అప్పగించారు. 3 సంవత్సరాల వయసు గల ఆ పాపను నర్వ పోలీస్ స్టేషన్ పరిధిలో తండ్రి కోల కురుమూర్తి, తల్లి అనితకు ఎస్ఐ ప్రభృతి రమేశ్ పోలీసుల సమక్షంలో అప్పగించారు.

ముందడుగు

- కొత్తపల్లి-జూరాల బ్రిడ్జి నిర్మాణానికి శ్రీకారం
- రూ.84.26 కోట్లతో నిర్మాణానికి టెండర్లు పూర్తి
- జనవరిలో పనులు ప్రారంభమయ్యే అవకాశం
- ఆర్‌అండ్‌బీ ఆధ్వర్యంలో మట్టి నమూనాల సేకరణ
- బ్రిడ్జి పూర్తయితే గద్వాల, ఆత్మకూర్ ప్రాంతాలు మరింత అభివృద్ధి



మట్టి నమూనాలను సేకరిస్తున్న ఆర్ అండ్ బీ అధికారులు

గద్వాల, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): కృష్ణానదిపై మరో వంతెన నిర్మాణానికి కార్యరూపం ప్రారంభం అయ్యింది. కొత్తపల్లి-జూరాల మధ్య బ్రిడ్జి నిర్మాణానికి రోడ్లు భవనాల శాఖ టెండర్లు పిలిచి పూర్తి చేసింది. అగ్రిమెంటు పూర్తి చేసుకొని జనవరి నుంచి పనులు మొదలు పెట్టే అవకాశం ఉంది. గద్వాల నుంచి ఆత్మకూర్ వరకు మట్టి నమూనాల సేకరణను ఆర్ అండ్ బీ మొదలు పెట్టింది. ఈ నెల చివరి వరకు మట్టి నమూనాలతో పాటు కృష్ణానదిలో డ్రిల్లింగ్‌లను నిర్వహించి ఏ మేరకు పిల్లర్ల నిర్మాణం చేయాలో పరీక్షలు కూడా పూర్తి చేసేందుకు సిద్ధం అయ్యింది. బ్రిడ్జి నిర్మాణం విషయంలో ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. దీంతో ఆర్‌అండ్‌బీ అధికారులు కూడా దీనిపైనే దృష్టి పెట్టారు. రెండేళ్లలో నిర్మాణం పూర్తయ్యే అవకాశం ఉంది. ఇదే జరిగితే గద్వాల-ఆత్మకూర్‌ల మధ్య దూరం 10.50 కిలో మీటర్లు మాత్రమే ఉంటుంది. అదే విధంగా హైదరాబాద్‌కు 30కిలో మీటర్లు తగ్గే అవకాశం ఉంది. రాకపోకలు పెరిగే అవకాశం ఉంది. ఇది పట్టణాల అభివృద్ధి విస్తరణకు వీలు కల్పిస్తుంది.

ప్రాజెక్టు నిపుణుల బృందం సూచనల ప్రకారం...

జూరాల ప్రాజెక్టు దిగువన రోడ్డు వంతెన లేకపోవడంతో రాకపోకలన్నీ ప్రాజెక్టు మీదుగానే సాగుతున్నాయి. దాదాపు 30ఏళ్లుగా భారీ వాహనాలతో పాటు తేలికపాటి వాహనాలన్నీ ప్రాజెక్టు మీదుగానే సాగాయి. దీంతో ప్రాజెక్టు సేఫ్టీ కమిటీ దీనిని వ్యతిరేకిస్తూ వచ్చింది. ఇరిగేషన్ శాఖ కూడా ఐదేళ్ల క్రితమే జూరాల ప్రాజెక్టు దిగువన బ్రిడ్జి నిర్మాణానికి రూ.121 కోట్లతో ప్రతిపాదనలు పంపింది. గత ప్రభుత్వం దీనిని పట్టించుకోలేదు. ఈ ఏడాది జూరాల ప్రాజెక్టు గేట్లు మరమ్మతులకు లోనుకావడం, గేట్ల నుంచి లీకేజీలు కావడంతో ప్రాజెక్టు గేట్లు ప్రమాదంలో పడ్డాయి. ఇది ప్రాజెక్టుకు ప్రమాదం తీసుకరావచ్చనే ప్రచారం జరగడంతో పత్రికలు ప్రధాన శీర్షికలలో ప్రచురించాయి. దీంతో ప్రభుత్వంలో చలనం వచ్చింది. ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్వయంగా ప్రాజెక్టును పరిశీలించారు. ప్రాజెక్టు సేఫ్టీ కమిటీ సూచనల ప్రకారం రూ.121 కోట్లతో దిగువన బ్రిడ్జి నిర్మాణం చేపడుతామని ప్రకటించారు.

స్థలం ఎంపికపై పోటాపోటీగా ర్యాలీలు

బ్రిడ్జి నిర్మాణ స్థల ఎంపికపై పోటాపోటీగా ర్యాలీలు, ధర్నాలు నిర్వహించారు. గతంలో ప్రకటించిన మాదిరిగానే రేవులపల్లి వద్ద నిర్మించాలని దాని సమీప గ్రామాల ప్రజలు ర్యాలీలు నిర్వహించి అధికారులకు వినతి పత్రాలు అందించారు. ఇదే సమయంలో కొత్తపల్లి-జూరాల మధ్యనే నిర్మించాలని కొత్తపల్లితో పాటు దాని పరిసర గ్రామాల ప్రజలు కూడా ధర్నాలు, ర్యాలీలు నిర్వహించారు. అయితే ప్రజా ప్రతినిధులతో పాటు అధికారులు సూచనల ప్రచారం కొత్తపల్లి-జూరాల మధ్య బ్రిడ్జి నిర్మాణం చేస్తే దూరం తగ్గి రెండు నియోజకవర్గాలు అభివృద్ధి చెందుతాయని, వ్యాపార సంబంధాలు మెరుగుపడుతాయని భావించి కొత్తపల్లి-జూరాల మధ్యనే నిర్మించేందుకు తుది నిర్ణయం తీసుకొని డీపీఆర్ తయారు చేశారు.

తగ్గనున్న 21 కిలోమీటర్ల దూరం

కృష్ణానదిపై కొత్తపల్లి-జూరాల మధ్య బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే గద్వాల- ఆత్మకూర్ పట్టణాల మధ్య దూరం 10.50 కిలో మీటర్లు మాత్రమే ఉంటుండటంతో దాదాపు 21కిలోమీటర్లు దూరం తగ్గే అవకాశం ఉంటుంది. అంతేకాకుంగా గద్వాలతో పాటు ఆత్మకూర్ పట్టణాలు అభివృద్ధి చెందమేకాకుండా వ్యాపార సంబంధాలు మెరుగు పడే అవకాశం ఉంది. హైదరాబాద్ వెళ్లడానికి గద్వాల నుంచి ఆత్మకూర్ మీదుగా కొత్తకోటకు చేరుకొని నేషనల్ హైవేకు చేరేందుకు అవకాశం ఉంది. హైదరాబాద్‌కు 30కిలోమీటర్ల దూరం తగ్గే అవకాశం ఉంది. ఎమ్మిగనూరు, ఆదోని, బళ్లారీలకు దూరం తగ్గే అవకాశం ఉంది. ఇలా అన్ని రకాలుగా మేలు జరుగుతుందనే కొత్తపల్లి-జూరాల మధ్యనే బ్రిడ్జి నిర్మాణానికి ప్రభుత్వం నిర్ణయం తీసుకొని టెండర్లను ఖరారు చేసింది.

టెండర్లు పూర్తి చేశాం

కొత్తపల్లి-జూరాల మధ్య బ్రిడ్జి నిర్మాణానికి టెండర్లు పూర్తి చేశాం. త్వరలో అగ్రిమెంట్‌ను కూడా చేసుకుంటాం. ప్రస్తుతం మట్టి నమూనాల సేకరణను నిర్వహిస్తున్నాం. పరీక్షలు పూర్తి చేసిన తర్వాత జనవరిలో బ్రిడ్జి నిర్మాణం పనుల ప్రారంభం అయ్యే అవకాశం ఉంది. సాధ్యమైనంత తర్వాత పనులు ప్రారంభిస్తాం.

- రాజేందర్,
ఎస్‌ఈ, రోడ్లు భవనాల శాఖ

పరిహారం పెంపును ఆమోదించాలి

- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి విజ్ఞప్తి


సీఎం రేవంత్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి

జడ్చర్ల, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం ఉదండాపూర్ రిజర్వాయర్ ముంపు గ్రామాల నిర్వాసితుల పునరావాస ప్యాకేజీ పెంపునకు సంబంధించిన అంశాన్ని కేబినెట్‌లో ఆమోదించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి కోరారు. రాష్ట్ర గృహనిర్మాణ, రెవెన్యూ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన సలహాదారులు వేంనరేందర్‌రెడ్డితో కలిసి బుధవారం హైదరాబాద్‌లోని ముఖ్యమంత్రి కార్యాలయంలో సీఎంను కలిశారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో పరిహారం పెంపునకు సంబంధించిన ఫైల్ ఆమోదం కోసం ప్రస్తుతం ఆర్థికశాఖ వద్దకు చేరిందని, అనంతరం కేబినెట్‌లో పెట్టి ఆమోదించాలని కోరారు. ఇందిరమ్మ యాప్‌లో ఉన్న సాంకేతిక సమస్యలను తొలగించి, బిల్లులు సత్వరమే క్లియర్ చేసేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు ఇంటి నిర్మాణం ప్రారంభించి పునాదులు వేసుకున్నారని, యాప్‌లో అప్‌లోడ్ కాకపోవడంతో బిల్లులు ఆగిపోయాయని వివరించారు. రాజాపూర్ మండలం ఖానాపూర్ గ్రామంలో తన తాత దేశ్‌ముఖ్ పేరుతో ఉన్న భూములను రైతుల పేరుపై మార్చేందుకు ఇప్పటికే కలెక్టర్‌కు ప్రతిపాదనలను పంపామని, వాటిపై చర్యలు తీసుకోవాలంటూ రెవెన్యూశాఖ మంతిని కోరారు. ఆ భూములను రైతులకు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

పీయూలో జాతీయ ఔషధ వారోత్సవాలు

- పీయూ వీసీ జీఎన్ శ్రీనివాస్


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న పీయూ వీసీ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పూస రమేశ్‌బాబు, అధికారులు

పాలమూరు యూనివర్సిటీ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): పాలమూరు యూనివర్సిటీలోని ఫార్మసీ కళాశాల ఆధ్వర్యంలో బుధవారం ఫార్మసీ ఆడిటోరియంలో ఈ నెల 19 నుంచి 25 వరకు జరిగే జాతీయ ఔషధ వారోత్సవాల కార్యక్రమానికి పీయూ వీసీ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫార్మసీ విద్యార్థులకు సమాజంలోని విధులను నిర్వహించాలని, వైద్య రంగంలో ముఖ్య పాత్ర ఉందని, దానిని బాధ్యతగా తీసుకోవాలని అన్నారు. విశిష్ట అతిథి చిన్నారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు ఫార్మసీ పరిశ్రమలలో అవకాశాల గురించి, జనరల్ మెడిసిన్ తయారీ విధానం, అందుకు పాటించాల్సిన నియమాల గురించి వివరించారు. పీయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పూస రమేశ్‌బాబు, ప్రిన్సిపాల్ డాక్టర్ రవికాంత్, డాక్టర్ ప్రభాకర్ రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

బలవంతపు భూసేకరణ వద్దు

- తహసీల్దార్ కార్యాలయం ముందు రైతుల బైఠాయింపు


తహసీల్దార్ కార్యాలయం ముందు ఆందోళన చేస్తున్న రైతులు

బల్మూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): బలవంతపు భూసేకరణ చేయొద్దంటూ నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట రైతులు ఆందోళనకు దిగారు. భూసేకరణ చేస్తామంటూ మంగళవారం ఉదయం రైతులకు తహసీల్దార్ కార్యాలయం నుంచి ఫోన్లు వచ్చాయి. దీంతో బుధవారం ఉదయం అనంతవరం, మైలారం, అంబగిరి, బల్మూరు గ్రామాల రైతులు మండల కేంద్రంలోని ఆలయ ప్రాంగణంలో సమావేశమయ్యారు. ఉమామహేశ్వర రిజర్వాయర్‌ను ఈ ప్రాంతంలో నిర్మించవద్దని మా భూములు పోతే మేము దిక్కులేని వారమవుతామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా, అధికారులు రైతులతో మాట్లాడకుండా, ప్రజా సేకరణ చేయకుండానే ఇలా భూమిని సర్వే చేస్తామని ఫోన్లు చేయడం ఏమిటని ప్రశ్నించారు. అక్కడి నుంచి ర్యాలీగా తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లిన రైతులు కార్యాలయం ముందు బైఠాయించారు. అనంతరం తహసీల్దార్ శ్రీకాంత్‌కు పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు.

ఈ సందర్భంగా రైతు సమన్వయ కమిటీ అధ్యక్షుడు సీతారాంరెడ్డి మాట్లాడుతూ రైతుల అభిప్రాయం లేకుండా ఈ ప్రాంతంలో రిజర్వాయర్ నిర్మాణం చేసి వారి ఉసురు తీసుకోవద్దన్నారు. కేవలం కొందరు లబ్ధి పొందడానికి మాత్రమే ఈ కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. మమ్మల్ని సంప్రదించకుండా ఎవరైనా అధికారులు భూమి మీదకి వస్తే పరిస్థితులు తీవ్రంగా ఉంటాయని రైతులు హెచ్చరించారు. రైతులు ఇంద్రారెడ్డి, నాగయ్య, మల్లేష్, రాజు, బాలస్వామి, బక్కయ్య, రాములు, నరసింహ పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలి

- ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్ డాక్టర్ ఎల్. కృష్ణ

బిజినేపల్లి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): రైతుల అభ్యున్నతి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన పథకాలను అన్నదాతలు వినియోగించుకోవాలని ప్రొఫెసర్ జయశంకర్ దక్షిణ తెలంగాణ వ్యవసాయ పరిశోధన కేంద్రం సహ సంచాలకుడు డాక్టర్ ఎల్. కృష్ణ సూచించారు. మండలంలోని పాలెంలోని ఆర్ఏఆర్ఎస్‌లోని అడిటోరియంలో కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి 21వ విడత నిధులు విడుదల కార్యక్రమంపై బుధవారం ప్రత్యేక సమావేశం నిర్వహించి మాట్లాడారు. కేవీకే కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీదేవి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి యశ్వంత్ రావు, జిల్లా ఉద్యాన వన శాఖ అధికారి చంద్రశేఖర్, ఎంఏవో కమల్ కుమార్, కేవీకే శాస్త్రవేత్తలు డాక్టర్ బి.రాజశేఖర్, డాక్టర్ ఒంగోలు శైల, డాక్టర్ రామకృష్ణ, డాక్టర్ ఆదిశంకర్ తదితరులు ఉన్నారు.

మహిళల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం

- రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేశ్‌రెడ్డి, కలెక్టర్ బదావత్ సంతోష్, మహిళా సంఘాల సభ్యులు

నాగర్‌కర్నూల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : మహిళల అభ్యున్నతే తెలంగాణ ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మంత్రులతో కలిసి సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, మహిళా సమాఖ్య ప్రతినిధులతో కోటిమంది మహిళలకు కోటి ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమంపై సమీక్షా సమావేశం నిర్వహించారు. నాగర్‌కర్నూల్ కలెక్టరేట్ నుంచి మంత్రి జూపల్లి కృష్ణారావు, కలెక్టర్ బదావత్ సంతోష్, నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేశ్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరయ్యారు. అనంతరం మహిళా సంఘాలతో మంత్రి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహిళలను సుస్థిర ఆర్థిక వ్యాపారస్తులను తయారు చేయాలని ఉద్దేశంతోనే స్వయం సహాయక సంఘాల సభ్యులకు అనేక రకాల పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు.

ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ స్వయం సహాయక మహిళా సంఘాల సభ్యులకు ఉచితంగా డ్రెస్‌కోడ్ మాదిరిగా తెలంగాణ ప్రభుత్వం సిరిసిల్లలో చేనేత కార్మికులతో రూపొందించిన చీరలను పంపిణీ చేస్తున్నందుకు సంతోషంగా ఉందని తెలిపారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ నాగర్‌కర్నూల్ జిల్లాలోని స్వయం సహాయక సంఘాల్లో సభ్యులుగా 1,68,104మంది ఉన్నారన్నారు. అదనపు కలెక్టర్లు అమరేందర్, దేవ సహాయం, పీడీ డీఆర్‌డీఏ చిన్న ఓబులేష్, జిల్లా పంచాయతీ అధికారి శ్రీరాములు, జిల్లాలోని 20మండలాలకు చెందిన స్వయం సహాయక సంఘాల అధ్యక్షులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

పట్టుకుంటుండగా కాటేసిన రక్తపింజరి

- ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న స్నేక్ క్యాచర్‌ను పరామర్శించిన మునిసిపల్ చైర్మన్


ఆసుపత్రిలో స్నేక్ క్యాచర్‌ను పరామర్శిస్తున్న పుర చైర్మన్

అచ్చంపేటటౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట పట్టణంలోని వేంకటేశ్వర కాలనీలో మంగళవారం రాత్రి ఇంటి ముందుకు రక్తపింజరి వచ్చింది. దీంతో యజమాని స్నేక్ క్యాచర్ సుమన్‌కు సమాచారం ఇచ్చారు. అక్కడకు చేరుకున్న సుమన్ రక్తపింజరిని పట్టే క్రమంలో అది కాటు వేసింది. వెంటనే ఆయన పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లగా, వైద్యులు చికిత్స అందించారు. విషయం తెలుసుకున్న మునిసిపల్ చైర్మన్ శ్రీనివాసులు, వార్డు కౌన్సిలర్ సునీతా రెడ్డి, ఆసుపత్రికి వెళ్లి సుమన్‌ను పరామర్శించారు.

ఇంటర్వ్యూ..

ప్రజల భాగస్వామ్యంతో శాంతిభద్రతలు సాధ్యం

- కురుమూర్తి, ఎస్ఐ, వెల్దండ



వెల్దండ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ప్రజల భాగస్వామ్యంతోనే శాంతిభద్రతలు సాధ్యమని వెల్దండ ఎస్ఐ కురుమూర్తి అన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే నేరుగా పోలీస్ స్టేషన్‌కు వచ్చి చెప్పుకోవాలని ఆంధ్రజ్యోతికి ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నారు.

సైబర్ నేరాల నివారణపై ఎటువంటి అవగాహన కల్పిస్తున్నారు ?

సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. ఈ క్రమంలో విద్యార్థులు, యువకులకు సైబర్ పరిణామాలపై వివరిస్తున్నాం. ఎవరైనా అపరిచిత వ్యక్తుల నుంచి ఫోన్‌కాల్స్ వచ్చినా, తమ వ్యక్తిగత సమాచారం, బ్యాంకు వివరాలు ఇవ్వాలని కోరినా స్పందించరాదు. ఎవరైనా సైబర్ బాధితులు ఉంటే 1930 నెంబరుకు ఫిర్యాదు చేయవచ్చు. స్టేషన్‌లో సైబర్ వారియర్ ప్రత్యేకంగా పని చేస్తుంటాడు.

రోడ్డు ప్రమాదాల నివారణకు ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు?

రోడ్డు ప్రమాదాల నియంత్రణకు పకడ్బందీగా చర్యలు తీసుకుంటున్నాం. డ్రంకెన్ డ్రైవ్‌లు నిర్వహించి మద్యం సేవించి వాహనాలు నడిపేవారిపై కేసులు నమోదు చేస్తున్నాం. ప్రతీ ఒక్కరు హెల్మెట్, సీటుబెల్టు ధరించేలా అవగాహన కల్పిస్తున్నాం.

ప్రజలకు పోలీసులు ఎలా చేరువవుతున్నారు ?

ప్రతీ గ్రామంలో గ్రామ పోలీసింగ్ వ్యవస్థను ఏర్పాటు చేసి ప్రజల వద్ద ఏవైనా సమస్యలు ఉంటే పరిష్కరించేలా చూస్తున్నాం.

న్యూస్ బాక్స్

తిమ్మాజిపేట తహసీల్దార్‌గా జయంతి



తహసీల్దార్ జయంతి

తిమ్మాజిపేట, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : తిమ్మాజిపేట తహసీల్దార్‌గా జయంతి బుధవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. గతంలో తహసీల్దార్‌గా పని చేసిన రామకృష్ణయ్య తాడూరుకు బదిలీ కాగా అక్కడ పని చేస్తున్న తహసీల్దార్ జయంతి డిప్యూటేషన్‌పై ఇక్కడికి వచ్చారు. డిప్యూటీ తహసీల్దార్ జ్యోతి, రెవెన్యూ గిర్దావర్ రవిచంద్ర, సీనియర్ అసిస్టెంట్ శ్రీకాంత్, సిబ్బంది ఉన్నారు.

సారా పట్టివేత: కేసు నమోదు

బిజినేపల్లి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కీమ్యాతండాలో ఎక్సైజ్ పోలీసులు దాడి చేసి రెండు లీటర్ల సారాను స్వాధీనం చేసుకొని బింగ్యా బావానిని తహసీల్దార్ మునీరుద్దీన్ ముందు బైండోవర్ చేశారు.

ఆలయ అభివృద్ధికి విరాళం

వెల్దండ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గుండాల అంబారామలింగేశ్వరస్వామి దేవాలయ అభివృద్ధికి చెదురుపల్లి గ్రామానికి చెందిన దెంది పరమేశ్వర్‌రెడ్డి విరాళం అందజేశారు. సుమారు రూ. లక్షా 20వేలతో ఆలయ సమీపంలోని కోనేరు చుట్టూ ఇనుప కంచెను ఏర్పాటు చేయించారు. అదేవిధంగా పెద్దరథాన్ని మరమ్మతు చేయించేందుకు మరో లక్ష రూపాయలు అందజేశారు. అర్చకులు పరమేశ్వర్‌రెడ్డి, పరిమళ దంపతులను శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు పర్వత్‌రెడ్డి, అరుణ్‌కుమార్, కృష్ణయ్య, అర్చకులు ఉన్నారు.

విద్యుత్ అధికారుల ప్రజాబాట

వెల్దండ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నారాయణపూర్‌లో బుధవారం విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో ప్రజాబాట కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను సరి చేశారు. విద్యుత్ స్తంభాలు, వేలాడుతున్న వైర్లను సరిచేసే పనులను పరిశీలించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అంజినాయక్, విద్యుత్ సిబ్బంది లింగారెడ్డి తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

వంగూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని కొండారెడ్డిపల్లి గేటు సమీపంలోని హైదరాబాద్-శ్రీశైలం ప్రధాన రహదారిలో ఆరేమైశమ్మ ఆలయం వద్ద బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు గాయపడ్డాడు. వంగూరుకు చెందిన యాదగిరి, నాగరాజు మరో వ్యక్తి కలసి కారులో కల్వకుర్తికి వెళ్తుండగా ఎదురుగా వస్తున్న వరికోత మిషన్‌ను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో యాదగిరి, నాగరాజులకు కాళ్లకు, దెబ్బలు తగిలాయి. వారిని చికిత్స నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

'కనీస వేతనం రూ. 26వేలు ఇవ్వాలి'

పెంట్లవెల్లి నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో సిఐటియు ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ వర్కర్స్ బుధవారం ధర్నా నిర్వహించారు. అనంతరం గ్రామ పంచాయతీ ఆఫీసు సిబ్బందికి వినతి పత్రం అందజేశారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బి.శివవర్మ, సీఐటీయూ మండల కన్వీనర్ శివలీల మాట్లాడుతూ మూడు నెలల నుంచి గ్రామ పంచాయతీ కార్మికులకు జీతాలు ఇవ్వకుండా వారికి ఇబ్బంది పెడుతున్నారన్నారు.

సజావుగా ధాన్యం సేకరణ

- యన్మన్‌బెట్లలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభంలో మంత్రి జూపల్లి



యన్మన్‌బెట్లలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

కొల్లాపూర్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ధాన్యం కొనుగోళ్లు రాష్ట్రంలో వేగంగా, సజావుగా కొనసాగుతున్నాయని ఎక్సైజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. మండలంలోని యన్మన్‌బెట్ల, కొల్లాపూర్ పట్టణంలోని మార్కెట్ యార్డులలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రారంభించారు. కొల్లాపూర్ సింగిల్‌విండో సొసైటీ సీఈవో శ్రీనివాసులు తమ పట్ల అసభ్యంగా మాట్లాడుతున్నాడని కొందరు రైతులు మంత్రి దృష్టికి తీసుకురాగా, సింగిల్‌విండో సీఈవోపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. కొల్లాపూర్ సింగిల్‌విండో సొసైటీ సీఈవోను ఆదిలాబాద్‌కు బదిలీ చేయాలని అధికారులను ఆదేశించారు. కొల్లాపూర్ మార్కెట్ యార్డులో వసతులు కల్పించాలని వ్యవసాయ శాఖ కమిషనర్‌కు ఫోన్‌లో ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్డీవో భన్సీలాల్, తహసీల్దార్ భరత్, మాజీ సర్పంచ్ మేకల నాగరాజు, మాజీ ఎంపీపీ నిరంజన్‌రావు, మాజీ జడ్పీటీసీ హనుమంత్ నాయక్, మాజీ సర్పంచ్ పాశం నాగరాజు, సింగిల్‌విండో డైరెక్టర్ పసుపుల నరసింహ, కొల్లాపూర్ మునిసిపల్ కమిషనర్ చంద్రశేఖర్ రావు, మండల వ్యవసాయ అధికారి చిన్న హుస్సేన్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎండీ ఇక్బాల్, వంగ రాజశేఖర్ గౌడ్, ఖాదర్ పాషా, కమలాకర్ రావు, బచ్చలకూర బాలరాజు, కొమ్ము వెంకటస్వామి, బోరెల్లి మహేష్ పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల్లో అలసత్వం వహించొద్దు

- కలెక్టర్ బదావత్ సంతోష్

నాగర్‌కర్నూల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల్లో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల్లో వెనుకబడిన మండలాల అధికారులపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ దేవసహాయంతో కలిసి ఎంపీడీవోలు, గృహ నిర్మాణశాఖ, ఎంపీవోలతో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల గ్రౌండింగ్‌పై కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ వివిధ మండలాల అధికారులతో సమీక్ష నిర్వహించి మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ వివరాలను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో ఇప్పటి వరకు పూర్తైనవి, ఈ నెలలో ప్రారంభం కానున్న ఇళ్ల వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో అదనపు జిల్లా పరిషత్ సీఈవో గోపాల్‌నాయక్, గృహ నిర్మాణ శాఖ అధికారి సంగప్ప, పీడీ డీఆర్‌డీఏ చిన్న ఓబులేష్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

దుందుభీలో తాత్కాలిక మరమ్మతులు చేపట్టాలి

- పంచాయతీరాజ్ ఏఈ గోవిందును ఆదేశించిన ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేశ్‌రెడ్డి



దుందుభీలోని దెబ్బతిన్న కాజ్‌వేను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

తాడూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : కల్వకుర్తి వైపు వెళ్లే ప్రధాన రహదారి దుందుభీ నదిలో ఉన్న లోలెవల్ కాజ్‌వే పూర్తిగా దెబ్బతిన్నందున వెంటనే తాత్కాలిక మరమ్మతులు చేపట్టి రాకపోకలు కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేశ్‌రెడ్డి పంచాయతీరాజ్ ఏఈ గోవిందును ఆదేశించారు. బుధవారం సిర్సవాడలోని దుందుభీ నది వద్ద దెబ్బతిన్న లోలెవల్ కాజ్‌వేను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఎమ్మెల్యే నిధుల నుంచి ఖర్చు చేయాలని సూచించారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ రామచంద్రారెడ్డి, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు వినోద్‌కుమార్, నాగర్ కర్నూల్ మార్కెట్ చైర్మన్ రమణారావు పాల్గొన్నారు.

రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తాం

రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేశ్‌రెడ్డి అన్నారు. తాడూరు మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని నెల్లికుదురు గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో బుధవారం వరి కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు.

డబుల్ బెడ్రూం ఇళ్ల పరిశీలన

నాగర్‌కర్నూల్ టౌన్ (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని బస్ డిపో సమీపంలో నిర్మాణంలో ఉన్న డబుల్ బెడ్రూం ఇళ్లను స్థానిక ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి, మునిసిపల్ కమిషనర్ నాగిరెడ్డితో కలిసి పరిశీలించారు. వీలైనంత త్వరగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. మాజీ కౌన్సిలర్లు కొత్త శ్రీనివాసులు, నిజాముద్దీన్, మునిసిపల్, అధికారులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

- ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ



ఉప్పునుంతలలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

ఉప్పునుంతల. నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకొని మద్దతు ధర పొందాలని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ప్రభుత్వం నిబంధనల మేరకు తాలు, తేమ లేకుండా ధాన్యం కేంద్రాలకు తీసుకవచ్చి మద్దతు ధరపొందాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో అచ్చంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రజితమల్లేష్, జిల్లా సహకార సంఘం అధికారి రఘునాథరావు, సూపరింటెండెంట్ మధు, మండల వ్యవసాయాధికారి రమేష్, పీఏసీఎస్ సీఈవో రవీందర్‌రావు, పీఏసీఎస్ చైర్మన్ భూపాల్‌రావు, నాయకులు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అనంతరెడ్డి, మాజీ జడ్పీటీసీ అనంతప్రతాప్‌రెడ్డి, మామిళ్లపల్లి ఆలయ చైర్మన్ నరసింహారావు ఉన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

అమ్రాబాద్ (ఆంధ్రజ్యోతి) : అమ్రాబాద్ మండల పరిధిలోని మాధవానిపల్లి గ్రామానికి చెందిన శవ్వ బోడమ్మ (బాలమ్మ) అనే మహిళ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. బుధవారం దశదిన కర్మ జరగా, ఎమ్మెల్యే వంశీకృష్ణ హాజరై కుటుంబ సభ్యులను పరామర్శించారు. కాంగ్రెస్ నేతలు బాలింగంగౌడ్, కంచి రామయ్య, కుంద మల్లికార్జున్, చింతల రాజగోపాల్, బి.లింగం ఉన్నారు.

కొనుగోలు కేంద్రం ప్రారంభం

ఊర్కొండ (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఊర్కొండపేటలో ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏపీఎం మానస బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసులు, వహీద్, రవీందర్‌గౌడ్, షైబాజ్, రమేష్, అశోక్, శ్రీశైలం, అఖిల్ మహిళ సంఘాల నాయకులు మాధవి, శశికళ పాల్గొన్నారు.

పార్టీల రిజర్వేషన్లు అంగీకరించం

- బీసీ జేఏసీ జిల్లా నాయకుడు మ్యాకల శివశంకర్‌యాదవ్



నిరసన వ్యక్తం చేస్తున్న బీసీ జేఏసీ నాయకులు

నాగర్‌కర్నూల్ టౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : చట్టం లేకుండా పార్టీల పరంగా ఇచ్చే రిజర్వేషన్లను యావత్ తెలంగాణ బీసీ సమాజం అంగీకరించదని బీసీ జేఏసీ జిల్లా నాయకుడు మ్యాకల శివశంకర్ యాదవ్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో జిల్లా బీసీ జేఏసీ ఆధ్వర్యంలో ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. పార్టీ గుర్తుల్లేని ఎన్నికల్లో పార్టీ పరంగా రిజర్వేషన్లు ఇవ్వడమంటే బీసీలకు భిక్షం ఇచ్చినట్లేనని, ఈ అవమానాన్ని బీసీ సమాజం భరించదని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీసీ జేఏసీ జిల్లా నాయకులు దాసర్ల వెంకటస్వామి, కుంభం మల్లేష్ గౌడ్, అరవింద్‌చారి, కాశీంయాదవ్, రాజేందర్ గౌడ్, సత్యశీలసాగర్, కరుణాకర్, యాదయ్య, సుధాకర్, నిరంజన్, రఘుబాబు, బీఎస్పీ కళ్యాణ్, సీపీఐ శివశంకర్, సీపీఎం ఆర్.శ్రీనివాసులు, సాయిమహరాజ్ పాల్గొన్నారు.

ఇందిరా గాంధీ సేవలు చిరస్మరణీయం

- జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి నివాళి అర్పించిన మంత్రి జూపల్లి



ఇందిరాగాంధీ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డి, ఎమ్మెల్యే కూచకుళ్ల

నాగర్‌కర్నూల్/ కొల్లాపూర్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : భారత మాజీ ప్రధాని, కాంగ్రెస్ అధినేత్రి దివంగత ఇందిరా గాంధీ సేవలు చిరస్మరణీయమని తెలంగాణ రాష్ట్ర పర్యాటక ఎక్సైజ్, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. బుధవారం కొల్లాపూర్ పట్టణంలోని మంత్రి జూపల్లి క్యాంపు కార్యాలయం వద్ద ఇందిరా గాంధీ చిత్రపటానికి నివాళులర్పించారు. మంత్రి మాట్లాడుతూ ఇందిరా గాంధీ సాహసో పేతమైన నిర్ణయాలు తీసుకుని దేశాన్ని అభివృద్ధి పథంలో ముందుకు నడిపారని మంత్రి వెల్లడించారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలో ప్రజాపాలనలో భాగంగా ఇందిరా గాంధీ ఆశయ సాధన కోసం నిరుపే దలందరికీ ఇందిరమ్మ ఇళ్లు కేటాయిస్తున్నారని స్పష్టం చేశారు.కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



కొల్లాపూర్‌లో ఇందిరా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న జగదీశ్వరుడు

● కాంగ్రెస్ పార్టీ అగ్రనాయకురాలు, మాజీ ప్రధానమంత్రి భారతరత్న దివంగత ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా కొల్లాపూర్‌లో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రంగినేని జగదీశ్వరుడు ఆధ్వర్యంలో ఆమె చిత్రపటానికి పూల మాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆకునమోని రాము యాదవ్, న్యాయవాది మధుసూదన్‌రావు, జమీ ల్ అహ్మద్‌ఖాన్, గోవింద్‌గౌడ్ పాల్గొన్నారు.

నివాళి అర్పించిన ఎమ్మెల్సీ కూచకుళ్ల

ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డి పేర్కొన్నారు. మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జయంతి వేడుకలు బుధవారం నాగర్‌కర్నూల్‌లో ఘనంగా జరిగాయి. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన వేడుకల్లో ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డి, ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డిలు ఇందిరాగాంధీ చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ బ్యాంకులను జా తీయాకరణ చేయడం ద్వారా బడుగు, బలహీన వర్గాలకు ప్రయోజనం చేకూర్చిన ఘనత ఇందిరాగాంధీ దని అన్నారు. ఇందిరాగాంధీ జయంతి వేడుకల్లో మార్కెట్ కమిటీ చైర్మన్ రమణరావు, ఆ పార్టీ ముఖ్య నాయకులు వంకేశ్వరం నిరంజన్, బండారు ఇంద్రారెడ్డి, శ్రీకోటయ్య, తీగల సునేంద్ర, మాజీ కౌన్సిలర్లు ఎండి.నిజాం, జక్కా రాజు, ఎండి.సలీం, ఎండి.బాబాలు పాల్గొన్నారు.

డిప్యూటీ డీఎంహెచ్‌వోగా శివకుమార్

కందనూలు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ డిప్యూటీ డీఎంహెచ్‌వోగా ఉన్న డాక్టర్ ఎం.వెంకటదాస్ గద్వాల ప్రభుత్వ మెడికల్ కళాశాలకు పదోన్నతిపై వెళ్లారు. ఖాళీ అయిన డిప్యూటీ డీఎంహెచ్‌వోగా ఇటీవల బిజినేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఇన్‌చార్జి వైద్యాధికారిగా పని చేస్తున్న డాక్టర్ ఎం.శివకుమార్‌కు ఇన్‌చార్జ్ డిప్యూటీ డీఎంహెచ్‌వో నాగర్‌కర్నూల్ డివిజన్ బాధ్యతలు బుధవారం స్వీకరించారు. ఆయనను కార్యాలయ సిబ్బంది శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో సిబ్బంది నరసింహ, వై.శ్రీనివాసులు, చారి, కల్యాణ్, కొత్త బాలాజీ, సుకుమార్‌రెడ్డి, సురేష్‌కుమార్, చెన్నకేశవులు అభినందనలు తెలిపారు.

కురుమ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

- కురుమ యువ చైతన్య సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు చంద్రమౌళి

వంగూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ కురుమ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి కురుమల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేయాలని కురుమ యువ చైతన్య సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొత్తూరి చంద్రమౌళి అన్నారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ రాష్ట్రంలో కురుమలు 6 లక్షల మంది ఉన్నారని, ప్రభుత్వ, పార్టీ పదవుల్లో బీసీలకు న్యాయం జరిగినా కురుమలకు అన్యాయం జరుగుతుందన్నారు. కురుమలకు ప్రభుత్వం, విద్యా, రాజకీయ, ఆర్థిక రంగాల్లో ప్రాధాన్యం కల్పించినప్పుడే అభివృద్ధి చెందుతామన్నారు. హైదరాబాదులో ట్యాంక్‌బండ్‌పై దొడ్డి కొమరయ్య విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని, జనగామ జిల్లాకు కొమరయ్య పేరు పెట్టాలని ప్రభుత్వాన్ని కోరారు.

గోకారం రిజర్వాయర్‌ను రీ సర్వే చేయాలి

- ఎమ్మెల్యే కశిరెడ్డికి నిర్వాసితుల వినతి



ఎమ్మెల్యే నారాయణరెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న ఎర్రవల్లి, ఎర్రవల్లి తండా భూ నిర్వాసితులు

చారకొండ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గోకారం వద్ద చేపట్టనున్న రిజర్వాయర్‌ను మళ్లీ రీ సర్వే చేయించాలని ఎర్రవల్లి, ఎర్రవల్లి తండా భూ నిర్వాసితులు బుధవారం కల్వకుర్తిలో ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణ రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. భూ నిర్వాసితులు మాట్లాడుతూ 2016-17లో జరిగిన భూ సేకరణ సర్వే సక్రమంగా నిర్వహించకపోవడంతో గ్రామాలు పూర్తిగా ముంపునకు గురవుతున్నాయని అన్నారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారని వారు. తెలిపారు. కార్యక్రమంలో భూ నిర్వాసితులు ఏకుల ప్రకాష్, నాగయ్య, దేవందర్, సంజీవ, శేఖర్, పర్వతాలు పెద్దయ్య, గోపి, మొత్య పాల్గొన్నారు.

హామీలు అమలు పరుస్తున్నాం

కల్వకుర్తి, (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటినీ సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలోని ప్రజా ప్రభుత్వం అమలు పరుస్తుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. బుధవారం కల్వకుర్తి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కల్వకుర్తి, చారకొండ మండల కేంద్రం 67మందికి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్డీవో జనార్దన్‌రెడ్డి, జిల్లా ఎస్సీ ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యుడు జిల్లెల రాములు, తహసీల్దార్ ఇబ్రహీం, మార్కెట్ కమిటీ చైర్మన్ మనీలా సంజుకుమార్‌యాదవ్, కల్వకుర్తి మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్‌కుమార్, కల్వకుర్తి మాజీ జడ్పీటీసీ అశోక్‌రెడ్డి, మార్కెట్ డైరెక్టర్ పసుల రమాకాంత్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు చిమ్ముల శ్రీకాంత్‌రెడ్డి, కాయితీ విజయ్‌కుమార్‌రెడ్డి, ఎజాస్‌ఖాన్, దామోదర్‌గౌడ్ పాల్గొన్నారు.

పీఎం కిసాన్ నిధులు రైతుల ఖాతాల్లో జమ

అచ్చంపేట రూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) :మండలంలోని హాజీపూర్ గ్రామంలో బుధవారం బీజేపీ నాయకులు రైతులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ప్రధానమంత్రి సమ్మాన్ నిధి పథకం కింద 21వ విడత నిధులను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో బీజేపీ రాష్ట్రకౌన్సిల్ సభ్యులు మంగ్యానాయక్, జిల్లా కౌన్సిల్ సభ్యులు రామచంద్రయ్య, బీజేపీ నాయకులు పాపిశెట్టి రాములు హాజరయ్యారు.

సుహృద్భావంతో మెలగాలి

తాడూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : మానసిక వైకల్యం కలిగిన వ్యక్తుల పట్ల సమాజం సహృద్భావంతో మెలిగి వారికి అన్నిరకాలుగా సహాయపడాలని డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ శ్రీరామ్ ఆర్య అన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ నాగర్‌కర్నూల్ చైర్మన్ ఆదేశాల మేరకు మండలంలోని ఐతోల్ గ్రామ పంచాయతీలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నాల్సా లీగల్ సర్వీసెస్ పర్సన్స్ విత్ మెంటల్ ఇల్నెస్ అండ్ పర్సన్స్ విత్ ఇంటలెక్చువల్ డిజబులిటీస్ కార్యక్రమం నిర్వహించారు. వికలాంగులు తమ సమస్యల గురించి ఉచిత టోల్ ఫ్రీ నెంబరు 14416కు ఫోన్ చేసి వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు భాస్కర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సూపరింటెండెంట్‌గా లాక్యనాయక్

చారకొండ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) ఎంపీడీవో కార్యాలయంలో సూపరిండెంట్‌గా ముడావత్ లాక్యనాయక్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. లాక్యనాయక్ నాగర్‌కర్నూల్‌ఎంపీడీవో కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ చారకొండ ఎంపీడీవో కార్యాలయానికి సూరింటెండెంట్‌గా వచ్చారు.


'కార్మిక హక్కులను కాలరాస్తున్న ప్రభుత్వాలు'

వంగూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల హక్కులను కాలరాస్తున్నాయని, ప్రతిఘటించేందుకు కార్మికులంతా ఐక్యంగా ఉద్యమించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకుడు బాలస్వామి అన్నారు. కేంద్ర ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు కోడులుగా విభజించి వారి హక్కులను కాలరాస్తున్నాయని విమర్శించారు. కార్యక్రమంలో శివరాములు, అరుణ, గెల్వయ్య పాల్గొన్నారు.

మైనర్లకు వాహనాలు ఇస్తే చర్యలు : ఎస్ఐ

అచ్చంపేటటౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : మైనర్లకు వాహనాలు ఇస్తే చర్యలు తప్పవని ఎస్ఐ సద్దాం హుస్సేన్ అన్నారు. అచ్చంపేట పట్టణంలోని లింగాల చౌరస్తాలో తనిఖీలునిర్వహించగా బైకుపై నలుగురు రైడ్ చేస్తూ పట్టుబడడంతో వారికి ఎస్ఐ రూ.3వేల ఫైన్ విధించి వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహించినట్లు తెలిపారు. 18ఏళ్లు నిండని వారికి బైక్‌లు ఇవ్వడం చట్టవిరుద్ధమని, ఇలాంటి సందర్భాలలో తల్లిదండ్రులపైనే కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ తెలిపారు. ద్విచక్రవాహనంపై ఇద్దరికన్నా ఎక్కువమంది ప్రయాణించడం అత్యంత్య ప్రమాదకరమన్నారు. పరిమితికి మించి ప్రయాణించరాదన్నారు.

ఘనంగా ఝాన్సీ లక్ష్మీబాయి జయంతి



ఝాన్సీలక్ష్మీబాయి చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

కందనూలు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు చవ్వ ప్రమోద్ కుమార్ ఆధ్వర్యంలో ఝాన్సీ లక్ష్మీబాయి జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఆమె పోరాట పటిమను కొనియాడారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేందర్‌గౌడ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సుబ్బారెడ్డి, బీజేపీ ఎన్నికల రిటర్నింగ్ జిల్లా కన్వీనర్ బుసిరెడ్డి సుధాకర్‌రెడ్డి, పోల్‌దాస్ రాము, యాదగిరిరావు, జగదీశ్వర్‌రెడ్డి, సోమ ప్రగతి, లక్ష్మీ, బాలరాజు, నాగనోల్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిని కలిసిన నాయకులు

అచ్చంపేటటౌన్ (ఆంధ్రజ్యోతి) : బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచంద్రరావును నియోజవర్గ బీజేపీ సోషల్ మీడియా ఇన్‌చార్జి అఖిల్ రెడ్డితో పటు పలువురు నాయకులు బుధవారం హైదరాబాద్‌లోని బీజేపీ కార్యాలయంలో కలిశారు. సోషల్ మీడియాను పటిష్టం చేసేందుకు నాయకత్వం కృషి చేస్తుందన్నారు.

భక్తిశ్రద్ధలతో మహాయజ్ఞం

బిజినేపల్లి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : విశ్వావసు సంవత్సర కార్తీక చతుర్దశి పురస్కరించుని హనుమాన్ గాయత్రీ మహాయజ్ఞం మహోత్సవాన్ని ఆంజనేయ స్వామి మాలధారణ భక్తులు కనుల పండుగగా నిర్వహించారు. మండల కేంద్రంలోని సిరి సంపదల ఆంజనేయ స్వామి ఆలయంలో బుధవారం మద్దిమడుగు క్షేత్ర పీఠాధిపతి కేతావత్ జయరాం ఆధ్వర్యంలో ఉదయం ఆంజనేయస్వామి ఉత్సవ మూర్తులను గ్రామంలో ఊరేగించారు. ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు నెల్లికంటి మహేశ్వర్‌రెడ్డి, సభ్యులు సైదులు, సాయి, లక్ష్మయ్య, భానుప్రకాశ్ తదితరులు ఉన్నారు.

కిష్టయ్య సార్‌కు ఘన నివాళి

నాగర్‌కర్నూల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : గాంధేయ వారి పుట్టపాగ మహేంద్రనాథ్ అనుచరుడు నల్లవెల్లి కిష్టయ్య(91) సార్ అంత్యక్రియలు బుధవారం ఆయన స్వగ్రామం నల్లవెల్లిలో జరిగాయి. కిష్టయ్య సార్‌కు జాతీయ విద్యా సంఘం అధ్యక్షుడు ఎంఏ.హఫీజ్ ఖాన్, పుట్టపాగ మహేంద్రనాథ్ తనయుడు మునీంద్రనాథ్‌తో పాటు జాతీయ విద్యా సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా నివాళులర్పించారు. ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డి, ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్ రెడ్డి సంతాపాన్ని వ్యక్తం చేశారు.

'కపాస్ కిసాన్ యాప్‌ను రద్దు చేయాలి'

నాగర్‌కర్నూల్ టౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : పత్తి రైతుల ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ కోసం సీసీఐ రూపొందించిన కపాస్ కిసాన్ యాప్‌ను తక్షణమే రద్దు చేసి ఎలాంటి షరత్తులు లేకుండా పత్తి కొనుగోలు చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. బుధవారం రైతు సంఘం ఆధ్వర్యంలో గగ్గలపల్లి శివారులోని మిల్లులో ఏర్పాటు చేసిన సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి కొనుగోలును పరిశీలించారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం తక్షణమే కపాస్ కిసాన్ యాప్‌ను రద్దు చేసి తేమతో సంబంధం లేకుండా మద్దతు ధరకు కొనుగోలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతులు రఘు, శేఖర్, సయ్యద్, బాబురెడ్డి, సుధాకర్ రెడ్డి, సైదులు, శివుడు పాల్గొన్నారు.

ఆడపిల్లల రక్షణనే మా లక్ష్యం

- షీటీం ఇన్‌చార్జి ఎస్ఐ రజిత

పెద్దకొత్తపల్లి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఆడ పిల్లల రక్షణనే మా లక్ష్యమని నాగర్‌కర్నూల్ షీటీం ఇన్‌చార్జి ఎస్ఐ రజిత వెల్లడించారు. మండలం గంట్రావుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం షీటీం ఆధ్వర్యంలో ఆమె అవగాహన కల్పించారు. ఎస్ఐ మాట్లాడుతూ ఆడపిల్లలు ఎందులోనూ తక్కువ కాదన్నారు. అమ్మాయిలు, మహిళలు ఎవరికీ ఏ ఇబ్బంది ఎదురైనా వెంటనే షీటీం నెంబరుకు 8712657676కాల్‌చేయాలని షీటీం ఏఎస్ఐ విజయలక్ష్మి వివరించారు. ఈ కార్యక్రమంలో భరోసా కో ఆర్డినేటర్ శ్రీలత, షీటీం మెంబర్లు వెంకటయ్య, వెంకట్, స్కూల్ ప్రధాన ఉపాధ్యాయుడు భాస్కర్‌రావు, టీచర్లు విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల పరిశీలన

కల్వకుర్తి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలలో నిరుపయోగంగా ఉన్న పాత సామన్లు, శిథిలావస్థకు చేరిన గదులను స్టేట్ అబ్జర్వర్, ఎస్‌సీఈఆర్‌టీ డిప్యూటీ డైరెక్టర్ రేవతిరెడ్డి పరిశీలించారు. బుధవారం కల్వకుర్తి డివిజన్ పరిధిలోని కల్వకుర్తి, వెల్దండ, చారకొండ మండలాల్లోని పలు పాఠశాలలను ఆమె సందర్శించారు. వెల్దండ మండలంలోని ఎంపీపీఎస్ వెల్దండ, కొట్ర పాఠశాలలు, కల్వకుర్తి మండలంలోని ఎంపీపీఎస్, జేపీనగర్ తండా, తాండ్రా జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలను, చారకొండ మండలంలోని జడ్పీహెచ్‌ఎస్, జూపల్లి పాఠశాలలను ఆమె పరిశీలించారు. ఆమె వెంట సీఎంవో వెంకటయ్య, కల్వకుర్తి ఎంఈవో శంకర్‌నాయక్‌లు ఉన్నారు.

ట్యాంక్‌బండ్ మీద స్పెషల్ డ్రైవ్

కందనూలు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఎస్పీ ఆదేశాల మేరకు నాగర్‌కర్నూల్‌లోని ట్యాంక్‌బండ్ మీద ట్రాఫిక్ ఎస్ఐ కల్యాణ్ సిబ్బందితో కలిసి బుధవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. సామర్థ్యానికి మించి కూలీలను తరలిస్తున్న రెండు ఆటోలను సీజ్ చేసినట్లు తెలిపారు.

టీఎస్‌యూటీఎఫ్ మండల కమిటీ ఎన్నిక

పెద్దకొత్తపల్లి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో యూటీఎఫ్ మండల మహాసభ నిర్వహించి, మండల కమిటీని ఎన్నుకున్నారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ఆర్.కృష్ణ ముఖ్య అతిథిగా హాజరవగా మండల కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా ఎండీ గౌస్‌పాషా, ప్రధాన కార్యదర్శిగా డి.మల్లయ్య, గౌరవాధ్యక్షులుగా ఎస్.ఆంజనేయులు ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షురాలు ఎం.రమాదేవి, డివిజన్ ఆడిటర్ నారాయణ, జిల్లా కార్యదర్శులు పి.మహేష్‌బాబు, ఎస్.చంద్రశేఖర్, కే.శంకర్, కొల్లాపూర్ డివిజన్ ఎఫ్‌డబ్ల్యూఎఫ్ కన్వీనర్ రబ్బాని, జేవీవీ కొల్లాపూర్ డివిజన్ అధ్యక్షుడు మహమూద్ పాల్గొన్నారు.

గచ్చుబావి అభివృద్ధికి చేయూత

కల్వకుర్తి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : కల్వకర్తిలోని గచ్చుబావి శివాలయం అభివృద్ధికి 14వ వార్డు మాజీ కౌన్సిలర్ బావండ్ల మంజులమధు దంపతులు రూ.50వేల నగదును పూజారికి అందజేశారు. కార్యక్రమంలో పలువురు భక్తులు, యువకులు పాల్గొన్నారు.